
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



నామినేటెడ్ అయ్యేదెవరు?

- కార్పొరేషన్ పదవులకు కాంగ్రెస్‌లో పోటాపోటీ
- లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే భర్తీ చేస్తారని అంచనా
- సిఫారసు కోసం రాష్ట్ర నాయకులకు ఆశావహుల వినతులు

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ కార్పొరేషన్ పదవులతోపాటు పలు పాలకవర్గాల నియామక పదవులకు కసరత్తు ప్రారంభించడంతో జిల్లాలోని కాంగ్రెస్ ఆశావహులు పదవులపై ఆశలు పెంచుకుంటున్నారు. రాష్ట్రస్థాయి పదవులు జిల్లాకు స్వల్పంగానే దక్కే అవకాశం ఉండగా పదవులు ఆశిస్తున్న వారిసంఖ్య భారీగా ఉండడంతో ఎవరికి పదవులు దక్కుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. లోక్‌సభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తుండడంతో ఈ ఎన్నికల కంటే ముందే నియామక పదవులను ఇస్తారని పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది.

ఖమ్మం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో ఎన్నడులేని విధంగా జిల్లాకు డిప్యూటీ సీఎం పదవితో పాటు రెండు మంత్రి పదవులు దక్కాయి. ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ప్రత్యేక కేడర్ ఉంది. మరోవైపు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వర్గనుంచి కూడా టికెట్లు దక్కని నేతలు నియామయక పదవులపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లా కాంగ్రెస్‌లో నలుగురు ముఖ్యనేతలుండడతో ఎవరికివారు తమ అనుచరులకు నియామక పదవలు దక్కాలని కోరుకుంటున్నారు. ఎన్నికల సమయంక్ష టికెట్లు రాని వారికి సైతం కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవులు ఇస్తామని భరోసా ఇచ్చారు. సీఎల్పీనేత భట్టి వర్గం నుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, ఖమ్మం నగర అధ్యక్షుడు జావీద్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, బాలాజీనాయక్‌తోపాటు కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతానికి చెందిన పలువురు భట్టి వర్గీయులు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్గంనుంచి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు, తుపాకుల యలగొండస్వామి, మిక్కిలినేని నరేంద్ర తదితరులు పదవులు ఆశిస్తున్నారు. అలాగే జిల్లాలో సత్తుపల్లి, భద్రాచలం కొత్తగూడెం, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలనుంచి కూడా తుమ్మల వర్గీయులు నియామక పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇక రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు అధికసంఖ్యలో నియామకపదవుల కోసం పోటీలో ఉన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్ర రాజశేఖర్, రాష్ట్ర మహిళ ఆర్థికసహకార సంస్థ మాజీ చైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, బానోతు విజయబాయి, కోటారాంబాబు, మేకల మల్లిబాబుయాదవ్ తదితరులు నియామక పదవులు ఆశిస్తున్నారు. కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి వర్గనుంచి కూడా నియామకపదవులు కోసం పోటీపడుతున్నారు. ఖమ్మంనుంచి మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, రామ్మూర్తినాయక్, నాగండ్ల దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు, సూరంపల్లి రామారావు, మంజుల తదితరులున్నారు. అలాగే సత్తుపల్లినుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన బొక్కలగడ్డ చంద్రశేఖర్ తదితరులున్నారు. ప్రతి నియోజకవర్గంలోను కాంగ్రెస్‌కు సంబంధించి నలుగురు ముఖ్యనేతల అనుచరులు రాష్ట్ర, జిల్లాస్థాయి నియామకపదవుల కోసం నేతలనుంచి సిఫార్సులకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే ఎవరికి పదవులు వరిస్తాయన్నది కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. ఎవరికివారు కాంగ్రెస్ ముఖ్యనేతల చుట్టూ సిఫార్సుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌నుంచి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల నియామక పదవులపై దృష్టిసారిస్తారని కాంగ్రెస్‌వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరికివారు తమ అనుచరులకు పదవులు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేయనున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాలకంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే నియామక పదవులకు గట్టి పోటీ నెలకొంది.



సింగరేణి పెన్షనర్లకు
దక్కని 'సంక్షేమం'

- చీకటి సూర్యులకు అందని తెల్లరేషన్‌కార్డులు
- వార్షికాదాయాన్ని పరిగణలోకి తీసుకోని అధికారులు
- కనీస జీవనభృతి లేక తీవ్ర ఇబ్బందులు



ఇల్లెందు, జనవరి 20: సింగరేణి బొగ్గుగనుల్లో ప్రాణాలు పణంగా పెట్టి వెలుగులు అందించి సిరులు కురిపించిన కార్మికులు ఉద్యోగ విరమణ తరువాత ప్రభుత్వ సంక్షేమపథకాలకు నోచుకోవడంలేదు. సింగరేణి కార్మిక పెన్షనర్లను సైతం ప్రభుత్వ పెన్షనర్లుగా పేర్కొంటూ తెల్లరేషన్‌కార్డులు మంజూరుచేయడంలేదని వారు వాపోతున్నారు. రిటైర్డ్ కార్మికులు అరకొర పెన్షన్లతో తమ కుటుంబాలను పోషించుకోవడానికి, వైద్యసదుపాయాలు పొందడానికి అవకాశాలు లేక తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికే సంక్షేమపథకాలు వర్తింపచేస్తోంది. అయితే ఉద్యోగ విరమణ చేసిన వేలాదిమంది సింగరేణి కార్మికుల్లో నెలకు రూ.500 పెన్షన్లు పొందుతున్న వారు కూడా ఉన్నారు తెల్లరేషన్‌కార్డు పొందడానికి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో ఒక లక్షగా నిర్దేశించింది. అయితే ఉద్యోగ విరమణ చేసిన సింగరేణి కార్మికుల్లో వారు పొందుతున్న పెన్షన్లు అతితక్కువగా ఉండడం, వార్షికాదాయం రూ.2లక్షలు లేకపోయినా వారికి తెల్లరేషన్‌కార్డులు ప్రభుత్వ అధికారులు మంజూరుచేయడలేదని వాపోతున్నారు.

సింగరేణి పెన్షన్లు కార్మికుల కష్టార్జితం

సింగరేణి రిటైర్డ్ కార్మికులు పొందుతున్న పెన్షన్లు నిజానికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా లభించే పెన్షన్లు కావు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం పీఎఫ్, గ్రావిటీలు నెలసరీ వేతనంలో 50శాతం పెన్షన్ ఇస్తున్నారు. సింగరేణి కార్మికులు మాత్రం తమ ఉద్యోగ విరమణ అనంతరం ఆసరా కోసం తమ వేతనాలనుంచి ప్రతినెలా మినహాయించన సొమ్ముతోనే తుది 10నెలల మూలవేతనంలో కేవలం 25శాతం సొమ్మునే పెన్షన్‌గా పొందుతున్నారు. అందుకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) ట్రస్టును కార్మికులు బొగ్గుగనుల యాజమాన్యాలు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్నారు. సీఎంపీఎఫ్ సంస్థకు ప్రతినెలా కార్మికులు పెన్షన్ కోసం తమ వాటా ధనం చెల్లిస్తూ ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అందులోనుంచి పెన్షన్ పొందుతున్నారు. ప్రభుత్వ పరంగా వారికి ఎటువంటి ఆసరాలేదు. 20వేల మంది బొగ్గుగనుల రిటైర్డ్ కార్మికులు గత రెండు దశాబ్దాలు అతిస్వల్ప మొత్తంలో పెన్షన్లు పొందుతున్నారు. వారికి లభించే అరకొర పెన్షన్ జీవితాంతం అంతే మొత్తంలో చెల్లించబడుతుంది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా డీఏలు, పీఆర్సీలు పెరిగినా పెన్షన్లకు వర్తించదు. కనీసం ప్రభుత్వ పెన్షనర్ల మాదిరిగా చనిపోయినవారికి అంత్యక్రియలు ఖర్చులు కూడా ఈ చీకటి సూర్యులకు లభించడంలేదు. 1998నుంచి బొగ్గుగనుల్లో అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ల విధానం వల్ల నెలకు రూ.500మాత్రమే పెన్షన్ లభిస్తోంది.

నూతన ప్రభుత్వంపైనే ఆశలు

సింగరేణిలో చాలీచాలని పెన్షన్లు పొందుతున్న రిటైర్డ్ కార్మికుల కుటుంబాలు తమ పింఛన్లు నూతన పాలకులైనా పెంచుతారని ఆశగా ఎదురుచూస్తున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో వేలాది మంది కార్మిక కుటుంబాలు అరకొర పెన్షన్లతో బతకులీడిస్తున్నారు. పేరుకు పెన్షనర్‌గా ఉన్నా దినసరి కూలీలు పొందుతున్న ఆదాయం కూడా రావడంలేదు 2000 సంవత్సరం కంటే ముందు ఉద్యోగ విరమణ చేసిన కార్మిక కుటుంబాల పరిస్తితి మరింత దయనీయంగా ఉంది. వారు నెలకు రూ.500లోపే పెన్షన్ పొందుతున్నారు. తమను ఆదుకునే ప్రభుత్వం వస్తుందన్న ఆశతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో 11స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించారు. కొత్త ప్రభుత్వమైనా తమకు తెల్లరేషన్‌కార్డు ఇవ్వాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు.

కథ, కవిత కార్యశాలతో
తెలుగుభాషకు జీవం

- ముగింపు వేడుకల్లో ప్రముఖ కవి తూములూరి
- విద్యార్థులదే భవిష్యత్తు: వాసిరెడ్డి రమేష్‌బాబు



కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబుకు కవితను బహూకరిస్తున్న విద్యార్థి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, జనవరి 20: తెలుగు భాషకు జీవంగా కథ, కవిత కార్యశాల నిలుస్తోందని ప్రముఖ కవి వీఆర్. తూములూరి కొనియాడారు. బాలోత్సవ్, చిల్డ్రన్స్, కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కథ, కవిత కార్యశాల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సమాజంలో ఎవరైనా కథకులుగా మారుతున్నారంటే మనిషిగా మారుతున్నట్లేనని గుర్తు చేశారు. దృక్పథం ఉన్నవారే సమాజంలో కథకులుగా, కవులుగా రాణించే అవకాశాలు ఉన్నాయన్నారు. కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ కళ ఉన్నవారు ముందు తరాలకు ఆ కళలను అందించాలన్నారు. ఈ కార్యశాలను చూస్తే కడుపు నిండిపోయిందన్నారు. పూర్తి ఏకాగ్రతతో బాలబాలికలు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. 25 సంవత్సరాల క్రితం బాలోత్సవ్‌ను కొత్తగూడెం వేదికగా నిర్వహించి దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం తెచ్చామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కథకులు, కవియిత్రిలను శాలువలతో సన్మానించారు. విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యశాలలో 200ల మంది విద్యార్థులు పాల్గొనగా 'రంగుల కళ' అనే అంశంపై 120మంది విద్యార్థులు కవితలు రాశారు. కవితా విభాగంలో 10వ తరగతి విద్యార్థి జి.మౌన్య, 9వ తరగతి విద్యార్థి బి.వివేక్, 10వ తరగతి విద్యార్థి కె.రాజేశ్వరీ మొదటి మూడు స్థానాలలో నిలిచారు. కథా విభాగంలో 10వ తరగతి విద్యార్థి శ్రీవల్లి, తోట అజయ్‌కుమార్, 9వ తరగతి బి.లాహిరి మొదటి మూడు స్థానాల్లో నిలువగా ఎండీ సుహాన, వి.రమ్య తరువాత స్థానాలలో నిలిచారు. కార్యక్రమంలో కథా రచయిత్రి స్వర్ణ కిలారి, ప్రముఖ కళా రచయితలు కొట్టం రామకృష్ణారెడ్డి, మన్యం ఎలియ, కథకులు భాగవతం, కవుల విభాగంలో విజయవాడ ప్రాంతానికి ప్రముఖ కవి అనిల్, డ్యాని, దాచేపల్లికి చెందిన రవికుమార్‌కోసూరి, ఖమ్మానికి చెందిన కట్టుకోజుల రమేష్ ప్రసంగించారు. నిర్వాకులు మండవ సుబ్బారావు, మన్సూర్, శిరంశెట్టి కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు



మాట్లాడుతున్న ప్రముఖ కవి తూములూరి

ప్రశాంతంగా
నవోదయ ఎంట్రెన్స్

- పరీక్షకు 2,492 మంది విద్యార్థులు హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఖమ్మం డీఈవో సోమశేఖర్ శర్మ, పాలేరు నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో సోమశేఖర్ శర్మ, నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

ఖమ్మం ఖానాపురంహవేలి/కూసుమంచి, జనవరి 20: పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 3,140 మంది విద్యార్థులు హాల్‌టికెట్లు పొందగా 2,492 మంది పరీక్షకు హాజరయ్యారు. 648మంది విద్యార్థులు గైరా జరయ్యారని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్‌శర్మ, పాలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసులు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈవో, ప్రిన్సిపాల్‌తో పాటు బీఎల్‌వోలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశారు. డీఈవో సోమశేఖర్‌శర్మ ఖమ్మంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రిక్కాబ్ బజార్ హైస్కూల్, శాంతినగర్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పాలేరు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ కే. శ్రీనివాసులు నగరంలోని ఎన్నెస్పీ కాలనీ హైస్కూల్, రిక్కాబజార్ హై స్కూల్, గాంధీనగర్ హైస్కూల్, శాంతినగర్ హైస్కూల్, రాజేంద్రనగర్ హైస్కూల్, మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్ లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఖమ్మం జిల్లాలో బీఎల్వోలు ఖమ్మం, మధిర, సత్తుపల్లి ప్రాంతాల్లోని పరిక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, కొత్తగూడెం జిల్లాలో ఐదుగురు బిఎల్‌వోలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11:30నుంచి 1:30వరకు నిర్వహించారు. విద్యార్థులను ఉదయం 10:45 నిమిషాల నుంచి పరీక్షా హాల్లోనికి అనుమతించారు. చిన్నారులు తమ తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలన్నీ విద్యార్థులు, తల్లిదండ్రులతో కోలాహలంగా మారాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు

మందు ఎందుకో చెప్పాల్సిందే



- విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వినియోగం
- కేంద్రం ఆదేశాలతోనైనా మార్పు వచ్చేనా ?
- భద్రాద్రి జిల్లాలో రోజుకు రూ.10లక్షల వ్యాపారం
- అనర్హుల వల్లనే సమస్యలంటున్న సీనియర్ వైద్యులు

భద్రాచలం, జనవరి 20: యాంటిబయాటిక్ మందుల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. అనారోగ్య సమస్యతో ఆసుపత్రులకు వెళితే చాలా ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా యాంటిబయాటిక్‌లను వినియోగిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ముఖ్యంగా అర్హత లేని వారు చేసే వైద్య వల్లనే ఈ సమస్య మరింత జఠిలంగా మారుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తునాయి. ఈ నేపథ్యంలో విచ్చలవిడిగా యాంటిబయాటిక్స్‌ల వాడకంపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఈ క్రమంలో ఇకపై యాంటిబయాటిక్స్ రాస్తే కారణం చెప్పాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు మెడికల్, ఫార్మా సంఘాలకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) అతుల్ గోయల్ అన్ని మెడికల్, ఫార్మాసిస్టు సంఘాలకు, వైద్యకళాశాలలకు అత్యవసర విజ్ఞప్తి పేరిట లేఖ రాశారు. అధికారికంగా ఈ లేఖ గురువారం విడుదల కాగా వైద్య వర్గాల్లో సర్వత్రా చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోనే ఏజెన్సీ జిల్లాగా పేరుగాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యాంటిబయాటిక్స్ వినియోగం భారీగా ఉందని సమాచారం. జిల్లాలో మెడికల్ డిస్ట్రిబ్యూటర్లు/మెడికల్ ఏజెన్సీలు సుమారు వంద ఉండగా మెడికల్ షాపులు 700 వరకు ఉన్నాయి. వైద్య ఆరోగ్య శాఖ పూర్తిస్థాయి అనుమతులతో సుమారు 200ఆసుపత్రులు నడుస్తున్నాయి. ఇవి కాకుండా జిల్లాలో 800 మంది ఆర్‌ఎంపీలు ఉన్నారు. దీంతో యాంటిబయాటిక్ మందులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలువురు డిస్ట్రిబ్యూటర్‌లు తమ బ్రాండ్ల మందులను అమ్ముకునేందుకు కొంత మంది వైద్యులకు, ఆర్‌ఎంపీలకు భారీగా ప్రోత్సాహకాలు ఇస్తుండటం వల్ల కూడా యాంటిబయాటిక్స్ వినియోగం పెరిగిందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

జిల్లాలో రోజుకు రూ.10లక్షలు పైనే వినియోగం

జిల్లాలో రోజుకు రూ.10లక్షలకు పైగా విలువైన యాంటిబయాటిక్స్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా అవసరం లేకున్నా తొలిరోజు నుంచి యాంటిబయాటిక్స్ వినియోగిస్తుండటంతో అత్యవసర సమయంలో అవి పని చేయడం లేదని వైద్య వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా అర్హత లేని వారు పూర్తిస్థాయిలో వైద్యపరమైన అవగాహన లేకుండానే యాంటిబయాటిక్స్‌ను రాస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనివల్ల కొంత మందికి కొన్ని సమయాల్లో దుష్పరిణామాలు ఎదురవుతున్న సందర్భాలు ఉన్నాయి. అవగాహన లేకుండా రాసే యాంటిబయాటిక్స్ మోతాదుకు మించి వాడటంతో ఇతర ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.



అర్హతలేని వారితోనే అసలు సమస్య

అర్హత లేని వారి వల్లనే యాంటిబయాటిక్స్‌ల వినియోగం గణనీయంగా పెరుగుతోందని వైద్య వర్గాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హత ఉన్న వైద్యులు జిల్లాలో ఇప్పటికే చాలాచోట్ల రోగి ప్రిస్క్రిప్షన్‌లో ప్రొవిజినల్ డయోగ్నసిస్‌లో ఎందుకోసం యాంటిబయోటిక్‌లు రాస్తున్నారో స్పష్టం చేస్తున్నారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. అయితే మరికొంత మంది పూర్తిస్థాయిలో ఈ పద్ధతిని అనుసరించకపోయినా ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ప్రధానంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే వారు అర్హత లేని వారి వద్దకు వెళ్లినప్పుడే యాంటిబయాటిక్స్ రాస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారు రాసే మందులు దేనికి వినియోగిస్తారనే కనీస అవగాహన లేకపోవడంతో ప్రాథమిక స్థాయిలోనే అధిక మోతాదు యాంటిబయాటిక్స్ వాడటం వల్ల దీర్ఘకాలంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా కొంత మంది ఆర్‌ఎంపీలు మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేయడం, వారికి పలువురు మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌లు ప్రోత్సాకాలు ఇస్తుండటంతో యాంటిబయాటిక్స్ వినియోగం అదుపుతప్పుతోంది.

ఇకనైనా తీరు మారేనా ?

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో యాంటిబయాటిక్స్ విషయంపై ఇకనైనా మార్పు వస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా యాంటిబయాటిక్స్ వినియోగం వల్ల ప్రపంచ వ్యాప్తంగా యాంటిమైక్రోబియల్ (ఎఎంఆర్) అనే రుగ్మత పెరిగిపోతోంది. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న పది అనారోగ్య సమస్యల్లో ఇది ఒకటి కావడంతో 2019లో ప్రపంచ వ్యాప్తంగా 49లక్షల మంది ఔషధ నిరోధక ఇన్‌ఫ్రెక్షన్లతో చనిపోయారని డీజీహెచ్‌ఎస్ అతుల్‌గోయల్ తెలపడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇకనైనా మందుల చీటీలో యాంటిబయాటిక్స్ ఎందుకు ఇస్తున్నారో స్పష్టంగా రాయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బహుళ ఉల్లంఘన!

» నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణం
» నోటీసులు జారీచేసిన మునిసిపల్ సిబ్బంది » అయినా కొనసాగుతున్న పనులు
» కూల్చేందుకూ వెనుకాడబోమంటున్న పురపాలక శాఖ అధికారులు

సత్తుపల్లి, జనవరి 20: సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో పలువురు బిల్డర్లు ఇష్టారాజ్యంగా బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారు. అనుమతులకు మించి భవనాలను నిర్మిస్తూ సంబంధిత అధికారులు నోటీసులు జారీచేసినా లెక్కచేయడం లేదు. కొందరు బిల్డర్లు అనుమతులు పొందిన సర్వే నెంబర్ ఒకటి అయినా మరో సర్వే నెంబర్‌లో నిర్మాణం చేపట్టారని ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా భవనాలను నిర్మిస్తుండగా వాటిపై చర్యలు తీసుకునే క్రమంలో రాజకీయ జోక్యం ఉండటంతో అధికారులు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. లెక్కకు మించి బహుళ అంతస్థుల భవనాలు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా దర్శనమిస్తున్నాయి. టీఎస్ బీపాస్ చట్టం నిబంధనలు బిల్డర్లు ఎంతమాత్రం పాటించడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

పట్టణంలోని గుడిపాడు రోడ్డుకు వెళ్లే మలుపు వద్ద జీప్లస్-2 భవన నిర్మాణానికి అనుమతులు పొందిన వ్యక్తి ఒకరు నిబంధనలకు విరుద్ధంగా జీప్లస్-4 భవనాన్ని నిర్మిస్తున్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో జీప్లస్-2 భవన నిర్మాణానికి మాత్రమే అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది. మునిసిపాలిటీలో అనుమతులు పొందిన సదరు వ్యక్తి ఇష్టారాజ్యంగా అదనపు అంతస్థులను నిర్మిస్తుండటంతో పలువురు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నోటీసులు జారీచేసినా ఖాతరు చేయకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తుండటంతో మునిసిపల్ అధికారుల రిక్విజేషన్ మేరకు పోలీసులు పనులను అడ్డుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సంఘటన తర్వాత కొద్దిరోజులు ఆగి తిరిగి పనులు ప్రారంభించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే భవనానికి సంబంధించి అనుమతి పొందిన సర్వే నెంబర్, భవనం నిర్మిస్తున్న సర్వే నెంబర్ వేర్వేరుగా ఉన్నాయనే ఫిర్యాదులు కూడా మునిసిపల్ అధికారులకు అందాయి. దీనిని కూడా పరిగణలోకి తీసుకుని అధికారులు విచారణ చేపట్టారు. సాధారణంగా టీఎస్‌బీపాస్ చట్టం ప్రకారం అనుమతి కోసం ధరఖాస్తు చేసిన సమయంలో ముందుగా రెవెన్యూ అధికారులు స్థలాన్ని సర్వే చేసి రికార్డు సరిగా ఉంటే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు పంపుతారు. అక్కడి నుంచి మిగిలిన వివరాలు సేకరించిన అనంతరం భవన నిర్మాణానికి అనుమతి ఇస్తారు. సర్వే నెంబర్‌పై కూడా వివాదం ఉండటంతో దీనికి సంబంధించిన వివరాలను అందజేయాలని సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ కే.సుజాత స్థానిక తహసీల్దార్‌కు లేఖ రాశారు. సర్వే నెంబర్ సరిగా ఉంటే అనుమతులకు మించి నిర్మించిన భవనంపై చర్యలు తీసుకుంటారు. సర్వే నెంబర్ కూడా తేడాగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.


గుడిపాడు రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

నిబంధనలకు విరుద్ధమైతే కూల్చివేస్తాం
సుజాత, సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్

గుడిపాడు రోడ్ వద్ద నిర్మిస్తున్న భవనానికి జీప్లస్-2 అనుమతి మాత్రమే ఇచ్చామని సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ కే.సుజాత చెప్పారు. అదనపు అంతస్థులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విషయం వాస్తవమేనని, నోటీసులు జారీచేసి పనులు నిలిపివేశామని తెలిపారు. సర్వే నెంబర్ పై కూడా ఫిర్యాదులు అందాయని, రెవెన్యూ అధికారులకు లేఖ రాశామని, అక్కడి నుంచి తమకు అందిన వివరాల మేరకు సర్వే నెంబర్ తేడా ఉంటే స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చి భవనం మొత్తం కూల్చివేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.

అడవిగేదె మృతి కేసులో నిందితులకు రిమాండ్

నలుగురిపై కేసు.. పరారీలో ఇద్దరు
విలేకరుల సమావేశంలో ఎఫ్‌డీవో మంజుల


మాట్లాడుతున్న ఎఫ్‌డీవో మంజుల

సత్తుపల్లిరూరల్, జనవరి20: విద్యుత్ తీగలు తగలి మృతిచెందిన అడవిగేదె కేసులో నలుగురి వ్యక్తులకు 14రోజుల రిమాండ్ సత్తుపల్లి కోర్టు విధించినట్లు ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల తెలిపారు. శనివారం సత్తుపల్లిలోని ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సుమారు 5-6నెలల సూడు అడవిగేదె మండలంలోని రేగళ్ళపాడు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా భూములలో పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందినది. పంటను సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అడవి జంతువులు వచ్చి నాశనం చేస్తున్న కారణంగా ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలలో సాగు చేసుకుంటున్న రైతులు రక్షణగా విద్యుత్ తీగల కంచెలను ఏర్పాటు చేసుకున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. 2009లో ఇందిర జలప్రభ పథకంలో భాగంగా ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఏర్పాటు చేయగా కొందరు దుర్వినియోగం చేస్తున్నారన్నారన్నారు. జివ్వాజి చుక్కమ్మకు చెందిన పంటపొలంలో ఈ సంఘటన చోటుచేసుకోగా 100మీటర్ల దూరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, ఇలాంటి చర్యలతో పాటు జంతువులను వేటాడినా, చంపినా చట్టరీత్యా శిక్ష తప్పదని అన్నారు.

నలుగురికి రిమాండ్... పరారీలో ఇద్దరు

అడవిగేదె మృతిచెందిన విషయంలో రేగళ్లపాడు గ్రామానికి చెందిన జివ్వాజి శ్రీనివాసరావు, సున్నం అర్జున్, వడ్లంగి వెంకటేశ్వరరావు, వాడే రవిలను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి కోర్టుకు తరలించగా 14రోజుల పాటు రిమాండ్ విధించారన్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉండగా నేరం రుజువైతే 3నుంచి 7ఏళ్ల పాటు జైలుశిక్ష పడే అవకాశం ఉన్నట్లుగా ఎఫ్‌డీవో తెలిపారు. షెడ్యూల్-1 కేటగిరికి చెందిన జంతువు కావడంతో శిక్షలు కఠినంగా ఉంటాయని చెప్పారు. ఈనెల 19వ తేది రాత్రి అమర్చగా తెల్లవారుజామున విద్యుత్ తీగలకు అడవిగేదె బలవ్వగా మృతశిశువుకు జన్మనివ్వగా జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్‌విక్రమ్ సింగ్ సంఘటనా స్థలంలో విచారణ చేశారన్నారు. కార్యక్రమంలో రేంజర్లు పీ.స్నేహలత, కే.అరవింద్ ఉన్నారు.

8కిలోల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జనవరి20: నగరంలోని రాపర్తినగర్ సమీపంలో 9మంది వ్యక్తుల నుంచి 8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసుకమిషనర్ సునీల్‌దత్ శనివారం తెలిపారు. నగరంలోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని రాపర్తినగర్ బ్రిడ్జివద్ద టుటౌన్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, మోటారుసైకిల్‌పై బ్యాగులు కలిగి బ్రిడ్జికింద ఉండగా, పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒక వ్యక్తి పారిపోయారని తెలిపారు. మిగిలిన 8మందిని పట్టుకుని టుటౌన్ స్టేషన్‌కు తరలించి విచారించగా ఈనెల 12న ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన జీవన్ ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి ఒడిస్సా రాష్ట్రంలోని చిత్రగొండ గ్రామానికి వెళ్లాడు. అక్కడ శివ అనేవ్యక్తిని కలిసి 8కేజీల గంజాయిని కొనుగోలు చేసి తిరిఖమ్మం వచ్చి మిగతవారితో వాటాలు పంచుకుని వేరేవారికి అమ్మేందుకు మాట్లాడుతుండగా వారిని పోలీసులు పట్టుకున్నట్టు సీపీ తెలిపారు. అయితే వైరాకు చెందిన సిరిగిరి సురేష్ విస్సన్నపేటకు చెందిన జీవన్, ఎన్టీఆర్ జిల్లా నెమలికి చెందిన ఎం.గుణశేఖర్, వైరాకు చెందిన కంద్ర సతీష్, వైరా మండలం ముసలిమడుగుకు చెందిన ఇంద్రసేన గోపి, హైదరాబాదుకు చెందిన శెట్టిపల్లి శశి, ఖమ్మం గోపాలపురానికి చెందిన పొంగు రమేష్ అదేవిధంగా గోపాలపురానికి చెందిన పొదిలి జస్వంత్, కొణిజర్లకు చెందిన కోమటి సురేష్‌లపై కేసు నమోదుచేసి వారి వద్ద నుంచి 8కిలోల గంజాయితోపాటు ఓ ద్విచక్రవాహనం, ఏడు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్టు సీపీ తెలిపారు. అదేవిధంగా వాటి విలువ రూ.2లక్షల వరకు ఉంటుదని దీనిలో విస్సన్నపేటకు చెందిన జీవన్ అక్కడి నుంచి పరారైనట్టు సీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీలు హరికృష్ణ. శివరామయ్య, టుటౌన్ సీఐ కుమారస్వామి పాల్గొన్నారు.

విప్పలమడక ఆలయంలో చోరీ

వైరా, జనవరి 20: మండలంలోని విప్పలమడక సోమలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి హుండీలను పగులగొట్టి వాటిలో భక్తులు వేసి కానుకలను అపహరించుకుపోయారు. హుండీల్లోని కానుకలు రూ.పదివేల వరకు ఉంటాయని అంచనా. పోలీసులు శనివారం సంఘటనాస్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

ఖమ్మం క్రైం, జనవరి 20: రైలు కిందపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. ఖమ్మం నుంచి మల్లెమడుగు వెళ్లే రైల్వేట్రాక్‌పై సుమారు 65 సంవత్సరాల వయసు ఉన్న వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందాడు. అది గమనించిన రైల్వే సిబ్బంది జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించటంతో వారు సంఘటన వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కి తరలించారు.

రైల్వే ట్రాక్ పై గుర్తు తెలియని మహిళ..

బోనకల్, జనవరి 20: బోనకల్ రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్వే ట్రాక్ పై శనివారం గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీనివాసరావు అంబులెన్స్ ద్వార బోనకల్‌కు వచ్చారు. రైల్వే పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎటువంటి ఆదారాలు లభించక పోవడంతో మార్చురీలోనే మృతదేహాన్ని ఉంచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మంలో ట్రాఫిక్ ఏసీపీ తనిఖీలు

పలువురు వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు

ఖమ్మంక్రైం, జనవరి20: ఉద్దేశపూర్వకంగా నెంబర్‌ప్లేటులో ఉన్న లెటర్లు తొలిగించి నగరంలో తిరుగుతున్న పలువురు వాహనదారులపై చీటింగ్ కేసులు నమోదు చేసినట్టు ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన వాహనదారులుకు ఆయన ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌వద్ద కౌన్సెలింగ్ నిర్మవహించి చీటింగ్ కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి రెండు నెంబర్లు కనిపించకుండా స్టిక్కర్లు, ప్లాస్టర్లు వేస్తున్నారని, ట్రాఫిక్ పోలీసులు గుర్తించకుండా ఉండేదుకు ముందు నెంబర్ ప్లేటు సరిగ్గా ఉన్నా.. వెనుక నెంబరు ప్లేట్ బెండ్ చేస్తున్నారని తెలిపారు. దీంతో ట్రాఫిక్ చలాన్లు జనరేట్ చేయడం పోలీసులకు తలనొప్పిగా మారిందని, దీని వల్ల నెంబరులేని బైకులపై చైన్‌స్నాచర్లు నేరాలు చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇకపై నిరంతరం నగరంలో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా శనివారం తొమ్మిది వాహనాలు సీజ్ చేసి ఖమ్మం వన్‌టౌన్, టుటౌన్, త్రీటౌన్, అర్బన్ పోలీసుస్టేషన్లలో పలు వాహనదారులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. నంబరు ప్లేట్లు లేకుండా వాహనదారులు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కిన్నెరసాని కాలువలో ఈతకు వెళ్లి యువకుడి మృతి

పాల్వంచ, జనవరి 20: ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. భద్రాద్రి జిల్లా పాల్వంచలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం పంచాయతీకి చెందిన బోడ అజయ్(18) కొత్తగూడెంలో ఐటీఐ చదువుతున్నాడు. మధ్యాహ్నం సరదాగా తన స్నేహితులైన బానోత్ విష్ణువర్ధన్, అజ్మీరా గురునాథ్, భూక్యా శశాంక్‌లతో కలిసి పాల్వంచ వచ్చాడు. ఈ క్రమంలో కరకవాగులోని కిన్నెరసాని కాలువకు ఈత కొట్టేం దుకు వెళ్లారు. ఈ క్రమంలోనే అందరూ ఈత కొడుతుండగా అజయ్‌కి ఊపిరాడక నీట మునిగాడు. ఇది గమనించిన స్నేహితులు వెంటనే అజయ్‌ను ఒడ్డుకు చేర్చగా అప్పటికే అతడు మృతి చెందాడు. దాంతో వారు అజయ్ తండ్రి బోడ హతిరాం ఫోన్‌లో సమాచారం అందించారు. అనంతరం కుమారుడి మృతిపై హతిరాం పాల్వంచ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ రాము తెలిపారు.


మృతి చెందిన అజయ్

'సత్తుపల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి'

సత్తుపల్లిరూరల్, జనవరి20: భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం భద్రాచలంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐటీడీఏ పరిధిలోని ఆయా గ్రామాలలో అభివృద్ధి నిమిత్తం రూ.60కోట్ల నిధులను మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ నిధుల ద్వారా గ్రామాలలో మౌళిక వసతులు, సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఉన్నారు.

కిష్టారం గ్రామస్థుల వినతి

మండల పరిధిలోని కిష్టారం గ్రామంలోని అంబేద్కర్ నగర్ వాసులు సింగరేణి కాలుష్యం నుంచి తమను కాపాడాలంటూ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని గ్రామస్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని, రోగాలబారిన పడకుండా వైద్య శిబిరాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.


ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు


శ్రీవారిని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

జమలాపురం శ్రీవారికి సర్వంగాభిషేకం

ఎర్రుపాలెం జనవరి 20: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సర్వంగాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు విజయదేవశర్మ ఆధ్వర్యంలో శ్రీవారికి సుప్ర భాతసేవ, పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహిం చారు. ప్రతిష్ఠా స్వామికి నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి భక్తులకు దర్శనం కలిగించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు చేసి వేదిక వద్దకు చేర్చి నిత్య కళ్యాణాన్ని నిర్వహించారు. శనివారం కావటంతో భక్తులు పొంగళ్లను నివేదించారు. కార్యక్ర మాల్లో వ్యవస్థాపక ధర్మకర్త శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయ కుమారి, సోమయ్య, కృష్ణప్రసాద్, సాయి, వంశీ, విజయ్, మారుతిరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూతతో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం

కల్లూరు, జనవరి 23: కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ వి ద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కాంగ్రెస్ సీనియర్ నా యకుడు, పూర్వవిద్యార్థి పసుమర్తి చందర్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ కళాశా లలో 1977-79 ఇంటర్ బ్యాచ్‌కు చెందిన నాటి పూర్వ విద్యార్థులు ఎస్‌కె జానిమియా, పసుమర్తి వెంకటేశ్వరరావు, దోసపాటి భాస్కరరావుతో పాటుగా మిత్ర బృందం మధ్యా హ్న భోజన కార్యాక్రమానికి నగదు వితరణ చేశారు. ఇంటర్ పరీక్షలు ముగిసే వరకు తమ వంతుగా రూ. లక్ష వరకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాసరావు ప్రసంగిస్తూ పేద విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు కష్టపడి చదవాలని పూర్వ విద్యార్థులు కృష్ణారావు, భాస్కరరావు కోరారు. తోపుడుబండి అధినేత సాధిక్‌అలీ ప్రసంగిస్తూ తమ వంతుగా సాయింత్రం స్టడీఅవర్స్ సమయంలో పరీక్షలు ముగిసే వరకు స్నాక్స్ అందిస్తానని ప్రకటిచారు. కార్యక్రమంలో వేల్పుల కృష్ణయ్య, అధ్యాపక బృందం ఎస్‌కె అతహర్‌అలీ, కె శ్రీనివాసరావు, ప్రమీల, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పసుమర్తి చందర్‌రావు

ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తుల గడువు పెంపు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 20: బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీ సర్కిల్- ఖమ్మం ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువును 24 వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రి పాసైన అభ్యర్థులు గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అరు లైన అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాసుల్తను చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 1 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.శిక్షణ నాలుగు నెలల పాటు ఉంటుందని, ఎంపిక విదానం రిజర్వేషన్ల , డిగ్రీ లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు స్టడీ సర్కిల్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

బాలల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

భద్రాద్రి అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు



కొత్తగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బాలల ఆరోగ్యంతో పాటు సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణతో పాటు వారి ఆరోగ్యం పట్ల అవగాహనతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల బాలికలకు స్కిల్ డెవలప్ మెంట్‌లో శిక్షణ ఇస్తున్నామని, ఏడుగురు బాల కార్మికులను రక్షించి బాల సదన్‌కు తరలించామని, జిల్లాలో ఇప్పటివరకు ఇటలీకి ఇద్దరు, అమెరికాకు ఇద్దరు, ఇతర దేశాలకు 17 మంది పిల్లల్ని కలెక్టర్ ఆధ్వర్యంలో దత్తత ఇచ్చామన్నారు. 2017లో 18, 2018లో 18, 2019లో 29, 2020లో 25, 2021లో 17, 2022లో 50, 2023లో 50, 2024లో ఇప్పటి వరకూ ఒక్క బాల్యవివాహాన్ని ఆపామని వివరించారు. మిషన్ వాత్సల్య స్కీం అనుస రించి రాష్ట్రంలోనే అత్యధికంగా 714 మందికి నెలకు రూ.4000 చొప్పున అర్థిక సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ విజయ్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారిణి ఇందిర, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సంజీవరావు, డీసీపీఓ ఎం. హరికుమారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవి, డబ్ల్యూసీ మెంబర్స్ సుమిత్ర, అంబేద్కర్, సాధిక్ పాషా, పోలీస్ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 20: కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు పదవ తరగతి విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన శనివారం జరిగింది. అశ్వాపురం మండలంలోని చింతిర్యాల గ్రామానికి చెందిన రిమాలి ఉషోదయ అక్షయ్ కుమార్ అనే విద్యార్థి పాత కొత్తగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని వన్‌టౌన్ పోలీస్‌లకు తండ్రి అగస్టీన్ ఫిర్యాదు చేశారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌కు చెందిన కుదుముల ప్రవీణ్ కుమార్ రెడ్డి పదవతరగతి విద్యార్థి కూడా అదృశ్యమయ్యాడు. ఈనేపథ్యంలో బాలుడి తల్లిదండ్రులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి తల్లి మౌనిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువతులూ..

పాల్వంచ, జనవరి 20: యువతి అదృశ్యమైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఓ యువతి ఇంటర్ చదువును ఆపి ఇంట్లోనే ఉంటున్నది. శుక్రవారం రాత్రి ఆమె తల్లిదండ్రులు పొలంలో కాపలాకు వెళ్లారు. యువతి తన నానమ్మతో నిద్రించింది. మధ్యలో నానమ్మ లేచి చూడగా సదరు యువతి కనిపించకపోవడంతో ఆమె యువతి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. వెంటనే ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. ఉదయం సైతం ఆమె ఆచూకీని లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● కల్లూరు, జనవరి 20:కల్లూరు మండలానికి చెందిన ఓ యువతి కూడా అదృశ్యమైంది. ఆ యువతి శుక్రవారం రాత్రి నివాస గృ హంలో పడుకుంది. తెల్లవారు జామున (శనివారం) లేచి చూసే సరికి కనిపించలేదు. దీంతో సదరు యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బోనకల్, జనవరి 20: మండలంలోని జానకీపురం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన సిరిపురం సత్యనారాయణ ద్విచక్రవాహనం పై బోనకల్‌కు వెళ్లాడు. తిరుగు ప్రమాణంలో గ్రామానికి వస్తుండగా రోడ్డు పై సుబాబుల్ లోడ్ చేసిన ట్రాక్టర్ ట్రక్కును ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు పై నిలిపి ఉంచిన లోడింగ్ ట్రక్కు వల్ల ప్రమాదం జరిగిందన్నారు. ఇలాంటి వాహనాలను రోడ్ల పై ఉంచడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలకు నిలయంగా మారుతాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిబిరానికి తరలిన ఇల్లెందు కౌన్సిలర్లు

ఇల్లెందుటౌన్, జనవరి 20: ఇల్లెందు మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాసం కోసం తీర్మానం ఇచ్చిన కౌన్సిలర్లు శనివారం శిబిరానికి తరలిపోయారు. మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన 19 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చిన అనంతరం వచ్చే నెల 5న అవిశ్వాస తీర్మానం జారీ కావడంతో 19 మందిలో 16 మంది కౌన్సిలర్లు శిబిరానికి తరలిపోయారు. సుమారు 15 రో జుల పాటు శిబిరంలోనే ఉండే విధంగా తగిన ప్రణాళికలతో తరలిపో యినట్టు స మాచారం. మున్సిపాలిటిలో 24 మంది కౌన్సిలర్లలో 22 మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వా రు ఉండగా, ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల ముందు ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటే శ్వరావుతో పాటు ఐదుగురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే మిగిలి ఉన్న వారిలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా సీపీఐ, ఎన్డీ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానానికి జత కలిశారు. మూడు రోజుల క్రితం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరా బాద్‌లో, ఇల్లెందు మున్సిపల్ వైస్ ఛైర్మన్ జానీపాషాతో కలిసి కొందరు మున్సిపాలిటీ అంశాలపై చర్చించడం గమనార్హం. ఆ మరుసటి రోజే అవిశ్వాస తీర్మాన నోటిసులు జారీ కావడం విశేషం. కాగా, ఈ పరిణామంతో ఇల్లెందులో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వచ్చే నెల ఐదున ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.


సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

పత్తిని కొనుగోలు చేయాలి

సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధర్నా

తల్లాడ, జనవరి 20: పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు తల్లాడలోని సీసీఐ కొనుగోలు కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం తల్లాడలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. వివిధరకాల తెగుళ్లను తట్టుకొని పండించిన పత్తిని అమ్ముకునేందుకు రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువస్తే నిబంధనల పేరుతో కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతుసంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పండించటం కన్నా అమ్మటం రైతులకు కష్టతరంగా మారిందని, నవంబరులో ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు కేవలం 20రోజులు మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రంలో నామమాత్రంగా కొనుగోలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎప్పుడు సీసీఐ కేంద్రం తెరుస్తారో తెలియక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని తెలిపారు. రెండురోజుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిసి సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకువస్తే అధికారులు తాళాలు వేసి వెళ్లారని, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులను సంప్రదిస్తే సరైన సమాధానం లేనికారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ఆందోళన చేపట్టారు. ధర్నాలో సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు, రైతుసంఘం నాయకులు ఐనాల రామలింగేశ్వరరావు, పులి వెంకట నర్సయ్య, పుల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మయ్య, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, శ్రీనివాసరావు, గురువులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో జాతీయ ఆరోగ్య సమ్మేళనం నేడు


నేలకొండపల్లిలోని ప్రకృతి సిద్ధార్థ యోగా విద్యాలయం

నేలకొండపల్లి, జనవరి 20: నేలకొండపల్లిలోని ప్రకృతి ఆశ్రమంలో ఆదివారం జాతీయ ఆరోగ్య జమ్మేళనం నిర్వహిస్తున్నట్టు ప్రకృతి ఆశ్రమ నిర్వాహకుడు, ప్రకృతి వైద్యుడు డాక్టర్ రామచంద్ర చెప్పారు. శనివారం ఆశ్రమంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9 రాష్ట్రాల నుంచి దాదాపుగా 3వేల మంది ప్రతినిధులు సమ్మేళానికి హాజరవుతున్నారన్నారు. దీర్ఘకాలిక రుగ్మతలను నివారించటానికి ఎటువంటి చర్యలు చేపట్టాలనే దానిపై చర్చ నిర్వహించనున్నారు. సహజ వంటకాలు, మిల్లెట్స్ ఏర్పాటు చేస్తారు. జాతీయ ఆరోగ్య సమ్మేళనంలో 100 రకాల దేశవాళీ బియ్యం ప్రదర్శన, 100 రకాల దేశవాళీ కూరగాయల విత్తనాల ప్రదర్శన, మగ్గం నేత, మట్టి కుండల తయారీ ప్రదర్శన, భారత పురాతన మల్లఖంబ్ క్రీడా ప్రదర్శన, బాల,బాలికలచే కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కావున ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరై భారత జాతీయ ఆరోగ్య సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ రామచంద్ర కోరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

దుమ్ముగూడెం జనవరి 20: ఒక ప్రాంతానికి తీసుకున్న అనుమతి పత్రాలపై మరొక ప్రాంతానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను రెవిన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. చర్ల మండలంలోని ఓ ఇసుక ర్యాంపు నుంచి సత్తుపల్లి మండలానికి వెళ్లాల్సిన ఇసుక టిప్పరు దుమ్ముగూడెం మండలం సీతారాంపురం ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనుల వద్దకు అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ ఆదినారాయణ టిప్పరును స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. ఏకలవ్య పాఠశాల దగ్గర దిగుమతి చేసిన 36 టన్నులతోపాటు టిప్పరులోని పన్నెండు టన్నుల ఇసుకకు ఈనెల 22న వేలంపాట నిర్వహిస్తామని ఆర్‌ఐ తెలిపారు. దాడుల్లో ఆర్‌ఐ లక్ష్మయ్య, సిబ్బంది ఈశ్వర్ ఉన్నారు.

వైద్యకళాశాలకు పార్థీవదేహం అప్పగింత


నగేష్ కుమార్(ఫైల్)

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 20: కొత్తగూడెం మున్సిపాలిటి గ్రీన్ అంబాసిడర్, రిటైర్డ్ సింగరేణి అధికారి మొక్కల వెంకటయ్య కుమారుడు రాయి నగేష్ కుమార్ (45) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సంఘటనతో కొత్తగూడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నగేష్‌కమార్ పార్థీవదేహాన్ని కొత్తగూడెంలోని స్వగృహంలో ఉంచారు. మొక్కల వెంకటయ్య అందరికీ సుపరిచితుడు కావడంతో పలువురు ఆయనను పరామర్శించి ఓదార్చారు. కుమారుడి పార్థివ దేహాన్ని కొత్తగూడెం మెడికల కళాశాలకు అందజేస్తున్నట్లు వెంకటయ్య ప్రకటించారు. మృతదేహానికి నివాళులర్పించిన వారిలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్ కమ్మపాటి విజయలక్ష్మి, టీపీసీసీ సభ్యులు జేబీ శౌరి, లగడపాటి రమేష్, గోరంట్ల సుగుణారావు, కమలారాణి, కమ్మపాటి సుధాకర్, కాపు కృష్ణ ఉన్నారు.

జాడలేని విదేశీ అతిథులు

- చింతపల్లికి చేరని సైబీరియా కొంగలు
- రెండేళ్లుగా మొహం చాటేసిన సుదూర బంధువులు
- ఈ ఏడాది వచ్చే వరకు నమ్మకం లేదు

ఖమ్మం రూరల్, జనవరి 20: వేల కి.మీ. దూరం నుంచి ప్రతీ సంవత్సరం ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామానికి వచ్చి విడిదిచేసే సైబీరియా కొంగలు ఈ సంవత్సరం ఇంకా చేరలేదు. చింతపల్లి గ్రామానికి తొలుత డిసెంబరు నెలలో పైలెట్ కొంగలు వచ్చి వాటికి అనుకూలంగా ఉందా లేదా అని రెండు రోజులు ఉండి వసతులు చూసుకుని తిరిగి వెళ్లేవి. జనవరి మొదటి వారంలో మిగిలిన కొంగలను వెంటతీసుకుని వచ్చేవి. జనవరి నుంచి జూన్ నెల వరకు సుమారు ఆరు నెలల పాటు చింతపల్లిలో విడిది చేసేవి. వాటి సంతతిని పెంచుకని తిరిగి జూలై మాసంలో సైబీరియా వెళ్లిపోయేవి. అయితే కొన్ని కొన్ని వందల సంవత్సరాలుగా కొనసాగిన ఈ ప్రయాణం గత రెండేళ్ల కానరావడం లేదు.

కొంగల రాక శుభపరినామం

ప్రతీ సంవత్సరం సైబీరియా నుంచి కొంగలు చింతపల్లి గ్రామానికి వచ్చి ఆరునెలలపాటు విడిది చేసి వెళితే అది శుభపరిమానంగా చింతపల్లి గ్రామస్థులు భావిస్తారు. గ్రామంలోని చింతచెట్లపై గూడ్లు కట్టుకుని వాటి సంతతని పెంచుకునేవి. కొంగలు రాకపోతే ఆ ఏడాది పంటలు పండక, వర్షాలు రాకుండా ఉండటంవంటి అశుభం ఏర్పడుతుందని గ్రామస్థులు విశ్వసిస్తారు. కొంగలు వస్తే ఏడాదిలో ఆరు నెలల పాటు ఆ గ్రామంలో సందడి ఉంటుందని వారంటున్నారు.



చింతపల్లి గ్రామంలో సందడి చేస్తున్న కొంగలు(ఫైల్)

రెండేళ్లుగా మోహం చాటేశాయి

సైబిరియా నుంచి వచ్చి విడిది చేసే కొంగలు గత రెండు సంవత్సరాలుగా చింతపల్లికి రావడం లేదు. ఈ ఏడాది కూడా ఇంతవరకు గ్రామానికి చేరుకోలేదు. కొంగలు రాకపోకపోవడంతో గ్రామంలో సందడి లేదని ప్రజలు వాపోతున్నారు. అవి చెట్లపై సందడి చేస్తుంటే పిల్లలు, పెద్దలు వాటిని చూస్తూ సంతోషంగా గడిపేవారు. అలాంటిది సుదూర బంధువులు రాకపోవడంతో ఊరు మూగబోయిందని వాపోతున్నారు.

ఈ ఏడాది వచ్చేనా?

గత రెండు సంవత్సరాలుగా చింతపల్లి గ్రామానికి మోహం చాటేసిన సైబీరియా కొంగలు ఈ ఏడాది అయినా వస్తాయా అని గ్రామస్థులు వాటి రాక కోసం ఎదురు చూస్తున్నారు. వచ్చేవయితే ఈ పాటికే పైలెట్ కొంగలు వచ్చి పరిసరాలను పరిశీలించేవని, నేటికీ రాకపోవడంతో ఈ ఏడాది వస్తాయో రావోనని అంటున్నారు.

మనుషుల మాదిరిగానే జీవనం

చింతపల్లికి చేరుకునే విదేశీ కొంగలు మనుషుల మాదిరిగానే జీవనం సాగిస్తాయి. మగ కొంగలు ఆహారం కోసం బయటకు వెళితే ఆడ కొంగలు ఇంటి వద్ద ఉండి వాటి పిల్లలను చూసుకుంటాయి. మానవ కుటుంబ వ్యవస్థలాగానే కొంగలు అనుబంధాన్ని ప్రదర్శించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాగా గ్రామంలో పెద్ద ఎత్తున చెట్లు నరకడంతోనే విదేశీ కొంగలు రావడం లేదని పలువరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న చింత చెట్లను తొలగించడంతోనే ఈ పరిస్థితి వచ్చిందంటున్నారు. గ్రామ శివారులోని చెరువు చుట్టూ చింతచెట్లు నాటి వాటిని సంరక్షించాలని, తద్వారా కొంగలకు కూడా ఇబ్బందులు ఉండవని గ్రామస్థుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వైరస్‌తో మిర్చి మటాష్

- తోటలకు ఎర్రనల్లి, బుడిదరోగం
- ఎకరాకు రూ.లక్షన్నరకు పైగానే పెట్టుబడి

చర్ల/ కారేపల్లి, జనవరి 20: ఆరుగాలం కష్టపడి పంటల రక్షణకోసం రూ. లక్షల పెట్టుబడి పెట్టి దిగుబడులు సాధించాలనుకున్న రైతుల ఆశలు ఆడియాశలు అయ్యాయి. కారేపల్లి, చర్ల మండలాల్లో గతేడాది కంటే రైతులు అధికంగా ఈసారి మిర్చి పంటను సాగుచేశారు. అయితే రైతులు సాగుచేసిన పంటపై ఎర్రనల్లి, బుడిదరోగం, చెట్టుకుళ్ల రోగం వంటివైరస్‌లు ఆశించాయి. నెలరోజుల క్రితం కురిసిన అకాలవర్షంతో చెట్లపై ఉన్నపూత, పిందెరాలిపోంది. కొంత మంది రైతులకు సంబంధించిన పంటలపై ఉన్న పూత, ప్రస్తుతం కురుస్తున్న మంచుకు రాలుతోంది. రైతులకు వైరస్ నివారణకు వ్యవసాయశాఖకు సంబంధించిన అధికారులు సలహాలతో క్రిమిసంహారక మందులు పిచికారి చేస్తున్నా లాభం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు.



వైరస్ సోకిన మిర్చి తోట

తగ్గిపోనున్న దిగుబడి

రేపో మాపో పంట చేతికి వస్తున్న తరుణంలో పంటలపై పురుగు దాడి చేస్తుండడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. చర్ల మండలంలో ఈడాది సుమారు 18 వేల ఎకలాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. ప్రతీ ఎకరాకు సుమారు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం పంట కాపు దశలో ఉంది. ముందుగా సాగు చేసిన కొన్ని చోట్ల మొదటి క్రాప్ జరుగుతోంది. కాగా పంట చేతికి వస్తున్న తరుణంలో మొక్కలపై నల్లి పురుగు దాడి చేస్తోందని రైతులు చెబుతున్నారు. మండలంలోని కొత్తపల్లి, కోరెగడ్డ, మొగళ్లపల్లి, లింగాపురం, వీరాపురం, కొత్తపల్లి, చర్ల, సుబ్బంపేట, కొయ్యూరు, మిడిసిలేరు, ఆర్‌కొత్తగూడెం, సత్యనారాయణ పురం ఇతర గ్రామాల్లో పంటలు దెబ్బతింటున్నాయని అంటున్నారు. నల్లిదాడితో పంట ఎదుగుదల ఉండదని, దిగుబడి కూడా తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 10క్వింటాల దిగుబడి వస్తే చాలా గొప్పఅని కన్నీరు పెడుతున్నారు. కాగా గత రెండు సంవత్సరాలుగా రైతులు తెగుళ్లదాడితో నష్ట పోయారు.



తోటలో వైరస్‌నివారణకు మందుకొడుతున్న గేటుకారేపల్లి రైతు

నేడు పంటలపై నల్లి దాడి చేస్తుండంతో ఈ ఏడాదికూడా నష్టాలు తప్పవని రైతులు భయాందోళన చెందుతున్నారు. అలాగే గత కొద్ది రోజుల క్రితం వచ్చిన అకాల వర్షాలకు మిర్చి మొక్కలు దెబ్బతిన్నాయి. పెట్టుబడి ఖర్చు కూడా పెరిగింది. ఇప్పటికైనా అధికారులు కనీస సూచనలు అయినా అధించాలని రైతులు కోరుతున్నారు.

మందులు ఎన్ని కొట్టినా లాభంలేదు: వెంకయ్య, కారేపల్లి

వైరస్ నివారణ కోసం లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నిరకాల మందులు కొట్టిన లాభంలేకుండా పోయింది. ఇప్పటికి ఎకరాకు ఐదు క్వింటాళ్ల మిర్చి కూడా దిగుబడి రాలేదు.

నాలుగు లక్షల పెట్టిబడి: పురం నారాయణ, కారేపల్లి

మిర్చిపంటసాగు కోసం మూడుఎకరాలు పంటసాగుచేశా. సరైన దిగుబడి రాలేదు. ఎంత ఖర్చు పెట్టి సాగు చేసినా నష్టం వాటిల్లింది. ఎకర తోటకు రూ. లక్షన్నరవరకు పెట్టిబడి పెట్టాను.

స్నానాల లక్ష్మీపురం వద్ద

వైరా నదిలో చెక్‌డ్యాం?

- నీటిపారుదల శాఖ అధికారుల సర్వే
- నిర్మాణానికి రూ. 5కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం

వైరా, జనవరి 20: వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురంలోని పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలోని వైరా నదిలో చెక్‌డ్యాం నిర్మాణానికి రెండు రోజుల కిందట నీటిపారుదలశాఖ అధికారులు సర్వే చేసినట్లు విశ్వసనీయ సమాచారం. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిలో యుద్ధప్రాతిపదికన చెక్‌డ్యాం నిర్మించేందుకుగానూ నీటిపారుదలశాఖ అధికారులు సర్వే చేపట్టారని తెలిసింది. నిర్మాణానికి రూ.5కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఖర్చుకానున్నట్లు సమాచారం. స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏటా శివరాత్రి జాతర మూడురోజులపాటు భారీగా జరుగుతుంది. వందల సంవత్సరాల చరిత్ర కల్గిన ఈ ఆలయానికి ఎదురుగా ఉన్న వైరా నదిలో వైరా పరిసర ప్రాంతాల్లోని ఏడెనిమిది మండలాలకు చెందిన వేలాదిమంది భక్తులు మహాశివరాత్రి వేకువజామునే నదిలో పుణ్యస్నానాలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. శివరాత్రి సమయంలో వైరా నదిలో నీటి లభ్యత ఉండని కారణంగా పుణ్య స్నానాలు చేసేందుకు ఇక్కడకు వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుటుంబానికి కూడా శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం ఆరాధ్యదైవంగా ఉంది. దాంతో భక్తునిగా భట్టి విక్రమార్క తనకు తొలిసారి లభించిన అవకాశాన్ని ఉపయోగించి ఇక్కడ భక్తులు స్నానాలు చేసేందుకు నీటి నిల్వ కోసం, ఇతర సమయాల్లో రైతులకు సాగునీటి అవసరాలను తీర్చేందుకుగానూ చెక్‌డ్యాం నిర్మించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. మార్చి నెలలో మహాశివరాత్రి వస్తున్నందున ఈలోగానే కనీస సౌకర్యాలు ఏర్పాటుచేయాలని నీటిపారుదలశాఖ, దేవాదాయధర్మాదాయశాఖ అధికారులను భట్టి విక్రమార్క ఆదేశిం చారు. ప్రస్తుతం స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిలో ఉన్న కాజ్‌వేకు కిందిభాగంలో ఈ చెక్‌డ్యాం నిర్మాణానికి సంబంధించి నీటిపారుదలశాఖ సీఈ విద్యాసాగర్, ఈఈ బాబూరావు, డీఈఈ పి.శ్రీనివాస్ తదితర అధికారులు ఇటీవల పరిశీలించారు. వైరా నదిలో వందమీటర్ల పొడవుతో నాలుగైదు అడుగుల ఎత్తులో చెక్‌డ్యాంను నిర్మించే విషయమై అధికారులు ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. చెక్‌డ్యాం నిర్మాణం వల్ల కాజ్‌వే వరకు 180మీటర్ల లోతులో దాదాపు కిలోమీటర్ విస్తీర్ణంలో ఎప్పుడూ నీరు నిల్వ ఉండేవిధంగా ఇక్కడ చెక్‌డ్యాం నిర్మించే ఆలోచనలో అధికారులు ఉన్నారని తెలిసింది. అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారని సమాచారం.



వైరా నదిని పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ సీఈ విద్యాసాగర్

టేకులపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం?

- రెండు రోజులుగా సంతకాలు

టేకులపల్లి, జనవరి 20: మండలంలోని బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్ లక్కినేని సురేందర్‌రావుపై అవిశ్వాస తీర్మానానికి పావులు కదుపుతున్నాట్లు సమాచారం. చైర్మన్ గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడం వల్ల కాంగ్రెస్ డైరెక్టర్‌ను చైర్మన్‌గా నియామకం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. 2020 ఫిబ్రవరిలో జరిగిన బేతంపూడి పీఏసీఎస్ ఎన్నికల్లో 13డైరెక్టర్లుకుగాను ఆరుగురు డైరెక్టర్లు బీఆర్ఎస్ నుంచి, మరో ఆరుగురు డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందగా ఒక డైరెక్టర్ ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. ఇండిపెండెంట్ డైరెక్టర్ మద్దతుతో బీఆర్ఎస్ డైరెక్టర్ లక్కినేని సురేందర్ రావు చైర్మన్ పదవీని పొందారు. కాని ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల వల్ల బీఆర్ఎస్ పార్టీలో గెలుపొందిన ఆరుగురు డైరెక్టర్లల్లో మెజార్టీ డైరెక్టర్లు కూడ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్ల బలంపుంజుకున్నట్టయింది. ఈ క్రమంలో రెండు రోజులుగా చైర్మన్‌పై అవిశ్వాసానికి సంతకాల సేకరణ నిర్వహిస్తునట్టు సమాచారం. మెజార్టీ డైరెక్టర్ల సంతకాలు సేకరించినట్టు తెలిసింది. బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ జిల్లా సహకార అధికారికి రెండు రోజుల్లో లిఖితపూర్వకంగా దరఖాస్తు చేయనున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఈ నెల 17న టేకులపల్లి ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో సొసైటీని కూడ కాంగ్రెస్ ఖాతాలో వేసుకొనేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్టు సమాచారం.



జాతీయ ఇంటర్ వర్సిటీ పోటీలకు ఇందుప్రియ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 20: త్వరలో బిహార్‌లో జరగనున్న జాతీయస్థాయి ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఇందుప్రియ ఎంపికైంది. ఆమె ఇటీవల వరంగల్‌లో జరిగిన కాకతీయ యూనివర్సిటీలో జరిగిన 5కి.మీ. పోటీలో ద్వితీయ, 150 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ స్థానాలు సాధించడంతో పాటు కామారెడ్డిలో జరిగిన 6 కి.మీ క్రాస్ కంట్రీ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన ఇందుప్రియను కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామకుమారస్వామి, మార్టియానా, రాకేష్ తదితరులు అభినందించారు. జాతీయ వర్సిటీ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.



రాష్ట్ర క్రికెట్ జట్టుకు భద్రాద్రి క్రీడాకారులు

భద్రాచలం, జనవరి 20: భద్రాచలానికి చెందిన ఎస్.గురువిద్యాన్, కె.మాన్‌విత్ అద్భుత ప్రదర్శనతో అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 170 మంది క్రీడాకారులతో పది జట్లుగా విభజించి నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వీరు ఉత్తమ ప్రదర్శన చేసి సెలక్షన్ టీం వీరిని ఎంపిక చేసింది. వీరిద్దరూ అండర్-14 టీం బృందంతో కలిసి జనవరి చివరి వారంలో గోవాలో జరగబోయే సౌత్‌జోన్ టోర్నమెంటులో పాల్గొననున్నారు. వీరిద్దరు భద్రాచలంలోని బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు. వీరికి అకాడమీ శిక్షకులు తేజా, లల్లు, బుజ్జి శిక్షణ ఇచ్చారు.



గురువిద్యాన్, మాన్‌విత్

అయోధ్యలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో

రేపు భద్రాద్రిలో ప్రత్యేక పూజలు

- శోభయాత్ర, సువర్ణపుష్ప పూజ, హవనం, దీపోత్సవం
- ఆకట్టుకోనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

భద్రాచలం, జనవరి 20: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి 7.30 వరకు నిత్యకల్యాణ మండపం వద్ద సువర్ణ పుష్పార్చన నిర్వహించనున్నారు. ఏడు గంటల నుంచి 10.30 వరకు ప్రచార రథంతో ఆలయం నుంచి అంబేద్కర్ సెంటరు వరకు అక్కడి నుంచి తిరిగి ఆలయం వరకు శోభాయాత్రను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. శోబాయాత్ర సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. శోభయాత్ర సమయంలో జై శ్రీరామ్‌తో కాషాయ జెండాలు ఏర్పాటు చేసి ఆలయంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సంక్షేప రామాయణ హవనం, సాయంత్రం 4 నుంచి 5.30 వరకు ఆలయ ప్రాంగణంలో సుందరాకాండ పారాయణం నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుంచి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణం, ప్రచార రథానికి పూలతో ప్రత్యేక అలంకరణ ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు వచ్చే భక్తులకు బెల్లంపొంగలి ఉచిత ప్రసాద వితరణ చేయనున్నారు. అయోధ్యలో జరిగే కార్యక్రమం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుండటంతో భద్రాద్రి రామాలయంలో ఉత్సవ శోభను ఇనుమడింపజేసే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.



ఆలయంలో నెక్లెస్ అందజేస్తున్న హైదరాబాద్ భక్తులు

రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శనివారం స్వామి వారికి స్వర్ణతులసార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహించారు. నిత్యన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఆకెళ్ల శ్రీనివాస్, ప్రదీప్ రూ.2.39 లక్షలు విలువైన 35 గ్రాముల హారం అందించారు.

తమ్మినేనికి మాజీమంత్రి పువ్వాడ పరామర్శ

ఖమ్మం కార్పొరేషన్, జనవరి20: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. తమ్మినేనికి అందిస్తున్న చికిత్స వివరాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకొంటారని తమ్మినేనితో పువ్వాడ పేర్కొన్నారు. పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.



తమ్మినేని వీరభద్రాన్ని పరామర్శిస్తున్న అజయ్

పెట్రో డీలర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోపాల్‌రావు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 20: పెట్రోలియం డీలర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మోతుకూరి గోపాల్‌రావు ఎన్నికయ్యారు. శనివారం అసోసియేషన్ కార్యాలయంలో గోపాల్‌రావును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. గతంలో ఆయన జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. గోపాల్‌రావు రాష్ట్ర కమిటీలో బాధ్యతలు స్వీకరించడం పట్ల జిల్లా డీలర్స్ అసోసియేషన్ నాయకులు రాయపూడి పవన్, దోరేపల్లి రవికుమార్, మాగంటి సత్యప్రసాద్ తదితరులు అభినందించారు.



మోతుకూరి గోపాల్‌రావు

12నుంచి భక్తరామదాసు జయంత్యుత్సవాలు

నేలకొండపల్లి, జనవరి 20: అపర భక్తాగ్రేసరుడు, ప్రముఖ వాగ్గేయకారుడు, భద్రాచలం రామాలయ నిర్మాత భక్త రామదాసు జయంత్యుత్సవాలు ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు భక్తరామదాస విద్వత్ కళాపీఠం ఒక ప్రకటనలో తెలిపింది. భక్తరామదాసు జన్మస్థలమైన నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరంలో మూడు రోజుల పాటు జయంత్యుత్సవాలను నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 12, 13, 14 తేదీల్లో నిర్వహించే ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి గ్రామస్థులు, కళాకారులు, విద్వాంసులు సహకారం అందించాలని భక్తరామదాసు విద్వత్ కళాపీఠం ప్రకటనలో కోరింది.



భక్తరామదాసు ధ్యాన మందిరం

సింగరేణి డైరెక్టర్(పా)గా ఎన్‌వీకే శ్రీనివాస్

రుద్రంపూర్ (సింగరేణి), జనవరి 20: సింగరేణి డైరెక్టర్ (పాజెక్టు అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్)గా ఎన్‌వీకే శ్రీనివాస్ నియమిస్తూ సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం నాయక్ శనివారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. తక్షణమే డైరెక్టర్(పా)గా పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కాసులు కురిపించిన నెం. 9999

- రూ.11,11,199కు ఆన్‌లైన్‌లో కొనుగోలు
- గరిష్ఠంగా పెరిగిన ఖమ్మం ఆర్‌టీవో ఆదాయం

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి20: వాహన ప్రియులకు 9 నెంబర్ కావాలనే క్రేజ్ ఉంటుంది. ఇక నాలుగు తొమ్మిదులతో కూడిన 9999 నెంబర్ అవకాశం ఉంటే ఇక ఏగబడి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తారు. ఖమ్మం రవాణాశాఖ కార్యాలయంలో శనివారం 9999 నెంబర్ అందుబాటులోకి రావటంతో ఆన్‌లైన్లోనే గిరాకి పెరిగింది. ఖమ్మంనగరానికి చెందిన మందాడ శ్రీనివాసరావు పోటీపడి మరీ టీఎస్04 ఎఫ్‌కే 9999 నెంబర్‌ను ఆక్షరాల రూ.11,11,199కు కొనుగోలు చేశారు. దీంతో ఖమ్మం రవాణాశాఖకు ఒక్క రోజులోనే రూ.12,49,585 ఆదాయం వచ్చింది.

గులాబీలు ఇచ్చి రోడ్డు భద్రతపై అవగాహన

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డీటీవో మహ్మద్‌గౌస్‌పాషా ఆధ్వర్యంలో ఖమ్మంలో శనివారం అవగాహన కల్పించారు. ద్వి చక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కారు, ఇతర వాహనదారులు రోడ్డుభద్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా నర్సింగ్ సీట్లు భర్తీచేయాలి

- వైద్య శాఖ మంత్రిని కోరిన ఐఎంఏ

భద్రాచలం, జనవరి 20: ఇండియన్ నర్సింగ్ కౌన్సిలింగ్‌కు అనుగుణంగా రాష్ట్రంలోని మెడికల్ యూనివర్సిటీలు సీట్లు భర్తీ చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.పి.కాళీ ప్రసాదరావు, కార్యదర్శి డాక్టర్. కె.విజయరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో రెండువేల బీఎస్సీ నర్సింగ్ సీట్లు భర్తీకాకుండా ఉన్నాయని తక్షణమే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కాళోజి నారాయణ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ తగిన చర్యలు చేపట్టాలని కోరారు గతంలో మాదిరిగా కన్వీనరు, మేనేజ్‌మెంటు కేటగిరీల్లో ప్రవేశాలకు అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. తద్వారా రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులంతా బీఎస్సీ నర్సింగ్ చదివేందుకు అవకాశం కల్పించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కె.విజయారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, డాక్టర్ బి.సుబ్బరాజు, డాక్టర్ జీవీవీ సుదర్శన్‌రావు, లయన్ సూర్యనారాయణ, జి.రాజారెడి ఉన్నారు.

యాసంగి పంటల సస్యరక్షణ

- చీడపీడల నివారణకు రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

మధిర, జనవరి 20: యాసంగి పంటల్లో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చీడపీడలు ఆశించి నష్టం చేస్తున్నందున వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మధిర వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.కె రుక్మిణి దేవి, శాస్త్రవేత్త నాగస్వాతి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు.

వరి... పొలంలో, పొలం గట్లపైన ఉండే గడ్డిజాతి కలుపు మొక్కలు అగ్గితెగులును వ్యాప్తిచేస్తాయి. కావున పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి -ప్రస్తుతం పొగమంచు వాతావరణ పరిస్థితులు నెలకొనివున్నందున వరి నారుమడిలో, ప్రధాన పొలంలో అగ్గితెగులు సోకుటకు అనుకూలం పరిస్థితులు ఉన్నాయి.

తెగులు కనిపిస్తే నివారణకు 0.5 గ్రా. ట్రైసైక్లాజోల్ లేదా 1.5మి.లీ. ఐసోప్రొథియోలిన్ లేదా 2.5 మి.లీ. కాసుగామైసిస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం తొలుచు పురుగు ఆశించుటకు ప్రస్తుతం వాతావరణం అనుకూల పరిస్థితులను కల్పిస్తుంది. నివారణకు.. పిలకలు లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గులికలను ఎకరానికి 10కిలోల చొప్పున వేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా టెట్రానిలిపోల్ 0.5 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మొక్కజొన్న.. పంటలో అక్కడక్కడ కత్తెర పురుగు కనిపిస్తున్నది. దీని నివారణకు 0.4 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.5మి.లీ. స్పైనటోరం మందును లీటరు నీటికి కలిపి ఆకుసుడుల లోపల తడిచేలా పిచికారి చేయాలి. మోకాలు ఎత్తు దశలో ఉన్న పైరుపై ఒక కిలో సున్నం మరియు 9కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించవచ్చు.

కంది.. పంట ప్రస్తుతం పిందె గట్టి పడే దశలో ఉన్నది. మారుక మచ్చలపురుగు ఆశిస్తోంది. నివారణకు క్లొరిపైరిఫాస్ 2.5మి.లీ. లేదా నోవాల్యూరాన్ 0.75 మి.లీ. తో పాటు డైక్లోరోవాస్ 1.0మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. శనగపచ్చపురుగునివారణకు.. తొలిదశలో లార్వాల నివారణకు 5శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి. పురుగు ఉధృతిని బట్టి 1.5గ్రా. ఎసిఫేట్ లేదా 2మి.లీ. క్వినాల్‌ఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి

పెసర, మినుము పంటల్లో.. ప్రస్తుతం ఈ పంటలను పొగాకు లద్దెపురుగు ఆశించింది. నివారణకు పొలం నుంచి గుడ్ల సముదాయాన్ని గుర్తించి ఏరివేయాలి. దీని నివారణకు 2.5 మి.లీ. క్లొరోఫైరిఫాస్ లేదా 1.6మి.లీ. దానితోపాటు 5మి.లీ. వేపనూనెను కలిపి పిచికారి చేసుకోవాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటను బూడిద తెగులు ఆశించే అవకాశం కనిపిస్తుంది. దీని నివారణకు 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1గ్రా కార్బెండాజిమ్ లేదా 1గ్రా. థయోఫానేట్ మిథైల్ మందును లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. పంటలో రసం పీల్చే పురుగులు ఆశించినట్లు గమనిస్తే.. నివారణకు ఫిప్రొనిల్ 2మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఆయా పంటల రైతులు ఈసూచనలను పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే పంట నష్టం నివారించడమే కాకుండా పంట ఎదుగుదల పెరిగి మంచి దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.


జిల్లా పౌరసరఫరాల అధికారిగా

చందన్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 20: ఖమ్మం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా కె. చందన్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆయన జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలిచ్చారు. ఆ తర్వాత ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా కార్యాలయం సిబ్బంది చందన్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఇప్పటి వరకు వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న కె.చందన్‌కుమార్‌ను ఖమ్మం డీఎస్వోగా నియమిస్తూ గత మూడు రోజుల క్రితం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ డీఎస్వోగా జి.శ్రీలత వ్యవహరించగా ఆమె స్థానంలో చందన్‌కుమార్‌ను నియమించారు. ఆమె చందన్‌కుమార్‌కు బాధ్యతలను అప్పగించారు. డీఎస్వోతో సీఎస్ డీటీలు సురేందర్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్వోగా బాధ్యతలు చేపట్టి కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసిన చందన్‌కుమార్



పకడ్బందీగా సిటీ పోలీసుయాక్ట్ అమలు: సీపీ సునిల్‌దత్



ఖమ్మంక్రైం, జనవరి20: జిల్లాలో సిటీ పోలీస్‌యాక్టు పకడ్బందీగా అమలు చేస్తున్నామని, బహిరంగప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 104మదిపై సిటీ పోలీస్‌యాక్టు కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో విధిగా సిటీపోలీసుయాక్ట్ అమల్లో ఉంటుందని, బహిరంగ మద్యపానం, పబ్లిక్‌న్యూసెన్స్, ర్యాష్‌డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించి షాపులు తెరవడం బర్త్‌డేల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలిపించేవారిపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. వీరిపై సిటీ పోలీసుయాక్టు అమలుచేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అలాంటి వ్యక్తులకు జరిమాన, జైలుశిక్ష పడే అవకాశాలున్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. రాత్రివేళల్లో పోలీసుపెట్రోలింగ్ ముమ్మరం చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సీపీ ప్రకటనలో తెలిపారు.

పన్నుల వసూలు లక్ష్యం నెరవేరేనా?

- ఎన్నికల తరుణంలో వసూళ్లపై అనుమానాలు
- బిల్ కలెక్టర్లకు అదనపు బాధ్యతలతో భారం
- ఆస్తిపన్నులు, ట్రేడ్‌లైసెన్స్‌లపైనే ఆధారం



ఖమ్మంకార్పొరేషన్,జనవరి20: ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలో పన్నుల వసూలు లక్ష్యం నెరవేరేలా కనిపించటం లేదు. స్థానికసంస్థల ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లపై తీవ్రప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తం అవుతున్నది. నగర పాలకసంస్థ రెవెన్యూ విభాగంలో సరిపడినంతమంది బిల్‌కలెక్టర్లు ఉన్నప్పటికీ, వారికి ఎన్నికల విధులు అప్పగించటంతో పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టలేకున్నారు. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం మార్చిలో లక్ష్యాలు పూర్తి అవుతాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆస్తిపన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరేనా?

ఈ ఏడాది మార్చినాటికి ఆస్తిపన్నులు రూ.28కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు రూ.15.50కోట్లు వసూలు అయ్యాయి. ఇంకా రూ.12,50కోట్లు వసూలు చేయాల్సిఉంది. అయితే గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు తదితర పనులు బిల్‌కలెక్టర్లను కేటాయించటంతో ఆస్తిపన్నుల వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతేకాకుండా ఎన్నికలు వస్తే ప్రజలు పన్నులు చెల్లించరు. వసూళ్ల మందగించటంతో ఆదాయం తగ్గుతుంది.

ట్రేడ్‌లైసెన్స్ ఫీజలు కూడా..

నగరంలో వివిధ వాణిజ్య, వ్యాపార వర్గాల నుంచి ట్రేడ్‌లైసెన్స్ ఫీజుల ద్వారా రూ.1.20 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.60లక్షలు మాత్రమే వసూలు అయ్యాయి. ట్రేడ్‌లైసెన్స్ ఫీజుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ ఫీజులను సకాలంలో వసూలు చేయకపోవటంతో, వ్యాపారవర్గాలు చెల్లించటం లేదు. అంతేకాకుండా రహదారి వెడల్పు ఆధారంగా, దుకాణాల కొలతల ఆధారంగా ప్రభుత్వం ట్రేడ్‌లైసెన్స్ ఫీజలను ఖరారు చేయటంతో ఫీజలు భారీగా పెరిగాయి. దీంతో వాటిని చెల్లించటంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. నోటీసులు ఇచ్చినా, జరిమానా విధిస్తామన్నా పట్టించుకోవటం లేదు.

ప్రభుత్వం నుండి నిధులు నిల్

ఖమ్మం నగరపాలకసంస్థకు పట్టణ ప్రగతి కింద ప్రభుత్వం నుంచి రూ.5కోట్లు రావాలి. ఇంతవరకు వాటి ఊసే లేదు. అలాగే గత ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. నిధులు విడుదల చేయకుండా ప్రకటనలకే పరిమితయయ్యారు. ఆ నిధులు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గం అభివృద్ధికి రూ.10 కోట్లు ఇస్తామని ప్రకటించింది. ఆ నిధులు ఎప్పుడు మంజూరవుతాయోనని ఎదురుచూస్తున్నారు.

నిర్వహణ ఎంతో భారం..

నగరపాలకసంస్థ కార్యాలయ నిర్వహణ భారంగా మారింది. ఉద్యోగుల వేతనాలు, విద్యుత్‌బిల్లులు ఇతరత్రా ఖర్చులతో కలిసి ఏడాదికి సుమారు రూ.45కోట్లు వ్యయం అవుతున్నది. నగరపాలకసంస్థకు వచ్చే సాధారణ నిధుల నుంచే ఈ ఖర్చు భరించాలి. కాగా బడ్జెట్‌లో 10శాతం గ్రీనరీకి కేటాయించాల్సి రావటంతో వచ్చిన సాధారణ నిధుల్లో కోత పడుతోంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే పరిస్థితి కూడాలేదు.

లక్ష్యాన్ని మించిన వైరా ఏఎంసీ ఆదాయం

- ఇంకా రెండు నెలల వ్యవధి
- ఇంకా పెరగనున్న ఆదాయం


వైరా వ్యవసాయ మార్కెట్ యార్డు

వైరా,జనవరి20: వైరాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని రాబట్టింది. 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగియటానికి ఇంకా రెండు,మూడునెలల వ్యవధి ఉండగానే టార్గెట్‌ను దాటి ఆదాయాన్ని రాబట్టింది. 2019-2020 నుంచి ఈ ఆర్థిక సంవత్సరం వరకు అంటే గడిచిన ఐదు సంవత్సరాల్లో మూడు సంవత్సరాలు లక్ష్యాన్ని దాటి ఆదాయం వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌యార్డు లక్ష్యం రూ.4.72కోట్ల పైచిలుకు లక్ష్యం కాగా గతఏడాది డిసెంబరు నాటికి రూ.5కోట్ల, 14లక్షల, 30వేల ఆదాయాన్ని రాబట్టింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల ఆదాయం కూడా జమకానుంది. మార్చి చివరినాటికి ఇంకా కొన్నికోట్ల రూపాయల ఆదాయం మార్కెట్‌కు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌యార్డు పరిధిలో వైరా, తల్లాడ, తనికెళ్లలో చెక్‌పోస్టులున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు ఈ మూడు చెక్‌పోస్టుల ద్వారానే రూ.2.79కోట్ల పైచిలుకు ఆదాయం వచ్చింది. మిగిలిన మొత్తం మార్కెట్‌యార్డులో ఆదాయం లభించింది. 2019-2020లో మాత్రం విధించిన లక్ష్యం మేరకు ఆదాయాన్ని రాబట్టలేకపోయింది. ఆ ఆర్థిక సంవత్సరంలో టార్గెట్ రూ.2.23కోట్లు కాగా వచ్చిన ఆదాయం రూ.2కోట్ల, 20లక్షల, 70వేలు మాత్రమే. అయితే 2020-21లో టార్గెట్ రూ.2కోట్ల, 45లక్షల, 30వేలు కాగా ఆదాయం రెట్టింపు వచ్చింది. రూ.4.56కోట్ల పైచిలుకు ఆదాయం వచ్చింది. కాగా 2021-22ఆర్థిక సంవత్సరంలో మాత్రం మార్కెట్‌యార్డు ఆదాయం లక్ష్యాన్ని దాటలేకపోయింది. టార్గెట్ రూ.2.25కోట్లు కాగా వచ్చిన ఆదాయం రూ.ఒక కోటి, 95లక్షల, 36వేలు మాత్రమే. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఆదాయం టార్గెట్ రూ.3.02కోట్లు కాగా ఆదాయం మాత్రం రూ.5కోట్ల, 86లక్షల, 37వేలు వచ్చింది. టార్గెట్‌ను మించి దాదాపు రూ.2.86కోట్ల ఆదాయం ఎక్కువగా వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9నెలల్లోనే లక్ష్యాన్ని మించి ఆదాయం సమకూరింది.

ల్యాప్‌టాప్ వితరణ

వైరా, జనవరి 20: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైరాలోని రాజశేఖర్ నగర్‌కు చెందిన నిరుద్యోగి వాడపల్లి దివ్య చంద్రికకు శనివారం ల్యాప్‌టాప్‌ను లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ నంబూరి మధు, మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అందజేశారు. బీటెక్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఆమె అవసరాలను గుర్తించి ల్యాప్ టాప్‌ను బహూకరించారు. కార్యక్రమంలో పి.ఉపేంద్రరావు, ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు, కొల్లా రాంబాబు, మరికంటి రామ్‌గోపాల్, మచ్చా రామారావు, గద్దే నీరజ పాల్గొన్నారు.

రగ్గులు, చీరల పంపిణీ

వేంసూరు, జనవరి20: జీవీఎం ఫౌండేషన్ ఛైర్మన్ గంగ్ర సోమిరెడ్డి, జయ దంపతుల ఆధ్వర్యంలో మర్లపాడు సొసైటీ వద్ద 70మంది వృద్ధులకు శనివారం రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగ్ర శరత్‌చంద్రారెడ్డి, సౌమ్య, గంగ్ర ప్రేమ్‌చంద్, దీప్తి, గంగ్ర మాధవరెడ్డి, రామచంద్రారెడ్డి, రేగళ్ల నర్సోత్తమరెడ్డి, గోపి, రామపుల్లయ్య, అప్పారావు పాల్గొన్నారు.

వైరా: వైరాలో శనివారం పేద మహిళలకు విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం సీతాకుమారి, సుమతీ పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వాసవీ కల్యాణమండపంలో గుర్రం విశిష్ట జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రూ.12500విలువైన పంపిణీ చేశారు. నంబూరి మధు, పెనుగొండ ఉపేంద్రరావు, చింతోజు నాగేశ్వరరావు, మరికంటి గోపి, కొల్లా రాంబాబు, శీలం పిచ్చిరెడ్డి, గద్దే నీరజ, రాయపూడి నారాయణ, చెరుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వీపీ.గౌతమ్
- నేడు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం


ప్రత్యేక ఓటరు నమోదును తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి20: ఫొటోఎలక్టోరల్‌రోల్ స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో భాగంగా శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ. గౌతమ్ కోరారు. శనివారం కలెక్టర్ నగరంలోని రోటరీనగర్ జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు ప్రతీ పోలింగ్‌బూత్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. బూత్‌లెవల్ అధికారులు ఉదయం 10గంటల నుంచి డ్రాఫ్ట్ ఫొటో ఓటర్‌లిస్ట్,ఫారం 6,7,8లతో అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేక కేంద్రాలకు వెళ్లి, తమ ఓటు నమోదు అయిందో, లేదో చూసుకోవాలని ఒకవేళ లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్. స్వామి పాల్గొన్నారు.

గ్యాడ్యుయేట్ ఓటర్ల నమోదు పక్కాగా ఉండాలి
కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్: గ్రాడ్యుయేట్ల ఓటర్ల నమోదు పక్కాగా ఉండాలని, ఎటువంటి పొరపాట్లు చేయవద్దని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి కోరారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఏర్పాటు చేసిన ఓటు నమోదుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన సందర్శించి, వివరాలను పరిశీలించారు. చిరునామా మార్పుకు సంబంధించి ధరఖాస్తుఫారమ్‌లు తీసుకోవాలన్నారు. అనంతరం కేంద్రాల్లోని మోప్మా రిసోర్స్‌పర్సన్‌లు బీఎల్‌వో యాప్‌ను వినియోగించే తీరును పరిశీలించారు. తీసుకున్న ఫారమ్‌లను సరిగా నమోదు చేస్తున్నారో లేదో తనిఖీ చేశారు. చనిపోయిన వారి పేర్లు తొలగించే సమయంలో మరణ ధృవీకరణ పత్రం తీసుకోవాలని, లేకుంటే కుటుంబసభ్యుల వాంగ్మూలం తీసుకోవాలని కోరారు.

ఓటు నమోదు చేసుకునేలా కృషి చేయాలి

బోనకల్: ప్రతీ గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు చేసుకునేలా కృషి చేయాలని ఆర్డీవో గణేష్ సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల, కలకోట గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ, పందిళ్లపల్లి గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియను ఆర్‌డీవో గణేష్ శనివారం పరిశీలించారు. నూతన ఓటరు నమోదు, ధరఖాస్తుల స్వీకరణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీవో రవీంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: పోలింగ్ కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కల్లూరు ఆర్డీవో ఎస్.అశోకచక్రవర్తి శనివారం పరిశీలించారు. ఆయన వెంట గిర్ధావర్లు జానీమియా, గోపీ ఉన్నారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

కల్లూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం పలు పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సాంబశివుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నాటికి దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదిగా నిర్ణయించటం జరిగిందని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫార్మ్ బిఎల్‌వో, తహసిల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మల్లు నందిని

ముదిగొండ,జనవరి20: మండలంలోని పెద్దమండవ గ్రామంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పర్యటించారు. గ్రామంలో ఇటీవల మృతిచెందిన సరోజనమ్మ దశదినకర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి, సంతాపం తెలిపారు. ఆమె వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు బులెట్‌బాబు, నర్సింగరావు, రవీందర్‌రెడ్డి, పెంట్యాల నాగేశ్వరరావు, కోడె నాగేశ్వరరావు, రాఘవ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

సత్తుపల్లిరూరల్, జనవరి20: సింగరేణి పరిధిలోని కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని జేవీఆర్ ఓసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అధికారులను కోరారు. శనివారం సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సత్తుపల్లి మునిసిపాలిటీలోని సింగరేణి క్వార్టర్స్‌ను నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో జీ.నరసింహారావు, సూర్య ప్రకాష్, భరణి, దమ్మలపాటి నర్సింహారావు, కాగితం వెంకటేశ్వర్లు, కంచ శ్రీనివాస్, జాడి రవి, గంగాధరణి నాగేశ్వరరావు, మురళీ, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు, జనవరి 20: సైబర్ నేరాల బారిన పడకుండ ప్రజలు అప్రమత్తంగా ఉండాలిని సత్తుపల్లి రూరల్ సీఐ హనుక్ పిలుపు నిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోటారు వాహనాలకు నెంబర్ ప్లేట్ సక్రమంగా లేనిచో అలాంటి వాహనాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని వివరించారు. రాత్రి పూట సమయంలో 10 గంటలకు వ్యాపార సంస్థలు, హోటళ్లు, మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. గంజాయి అక్రమ రవాణా, వ్యాపార లావాదేవిలపై తమకు తగిన సమాచారం అందిస్తే గోప్యంగా ఉంచి తగిన విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు.

మహిళా సంఘాల కార్యక్రమాలపై సమీక్ష

కల్లూరు, జనవరి 20: కల్లూరులోని ఉషోదయ సమైఖ్య కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల కార్యమాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీపీఎం శ్రీనివాస్ మాట్లాడతూ లోకాస్ యాప్‌లో ప్రతీసంఘంలో మొత్తం బ్యాంక్‌అకౌంట్ సభ్యుల ఆధార్‌కార్డు బ్యాంకు సంఘం వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏపీఎం వెంకట రామారావు, మండల సమైఖ్య ప్రతినిధులు, డీఎంజి ప్రశాంత్‌రెడ్డి, లోకాస్‌యాప్ గురించి వివరించారు. సమావేశంలో సీసీలు, పి.వెంకటేశ్వరరావు, సీహెచ్ శ్యామలదేవి, రాజ్యలక్ష్మీ, వెంకట్రావమ్మ, ఎస్తేరు ఆనందకుమారి, అపర్ణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

మండల సమావేశంలో జడ్పీచైర్మన్

మధిరరూరల్, జనవరి20: రానున్న వేసవిలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆదేశించారు. శనివారం మధిర మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందుకు సాగాలన్నారు. సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీకాలం మరో పదిరోజుల్లో ముగుస్తుందని, పనిచేసిన సర్పంచ్‌లందరూ కూడా ఆయా గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారని కొనియాడారు. గ్రామాల్లో వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.సర్పంచ్‌లను కమల్‌రాజ్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీపీ లలిత, ఎంపీవో శాస్త్రీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.


సర్పంచ్‌లను సన్మానించిన కమల్‌రాజ్

ఖమ్మం మార్కెట్‌లోకి నూతన క్రేటా కారు



వాహనాన్ని ఆవిష్కరిస్తున్న డీటీవో, షోరూం ఎండీ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి20: మారుతున్న సాంకేతికతతోడుగా మరింత భద్రతా ప్రమాణాలతో హ్యూండయ్ కార్ల కంపెనీ నుంచి సరికొత్తగా క్రేటాను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకరావటం మంచి పరిణామమని జిల్లా రవాణాశాఖ అధికారి మహ్మద్ గౌస్‌పాషా, భారత్ హ్యూండయ్ షోరూం నిర్వహకులు కేసా సుభాష్‌చంద్రబోస్ వివరించారు. శనివారం ఖమ్మంలోని భారత్ హ్యూండయ్ షోరూంలో నూతన క్రేటా కారును వారు ప్రారంభించి మాట్లాడారు. దేశీయ మార్కెట్‌లో ఎస్‌యూవీ రంగంలో క్రేటా కారు కొత్త అధ్యాయనంగా ఖ్యాతి పొందిందన్నారు. ఎంవీఐ వరప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన కల్పించారు. కారుసాంకేతిక, భద్రతా ప్రమాణాలను జనరల్ మేనేజరు కృష్ణ వివరించారు. ఎస్‌బీఐ ఆర్‌ఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేవలం 2 గంటల సమయంలో ఎస్‌బీఐ బ్యాంకు కారు రుణాలను మంజూరు చేస్తుందన్నారు. యూబీఐ డీజీఎం కే హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు : సత్తుపల్లి ఎంవీఐ

సత్తుపల్లిరూరల్, జనవరి20: అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం, నిర్లక్ష్యం కారణంగానే చోటుచేసుకుంటున్నాయని సత్తుపల్లి ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లీదండ్రులకు వివరించాలని కోరారు. పాఠ్య పుస్తకాలలో ట్రాఫిక్ నిబంధనలు గూర్చి పాఠ్యాంశాలుగా చేర్చారని, దాన్ని తూచా తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నక్కా రాజేశ్వరరావు, ఏఎల్‌వీ.రాంబాబు, సురేష్, మురళీమోహన్, శేషాచార్యులు, సుదర్శనమ్మ, గోపీ, రమాదేవి, రమాకుమారి, సుజాత, జాన్‌బీ, నాగమ్మ, వేరేసా, ఆర్టీవో సిబ్బంది కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో నేడు జాతీయ ఆరోగ్య సమ్మేళనం

నేలకొండపల్లి,జనవరి20: నేలకొండపల్లిలోని ప్రకృతి ఆశ్రమంలో ఆదివారం జాతీయ ఆరోగ్య జమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రకృతి ఆశ్రమ నిర్వాహకుడు, ప్రకృతి వైద్యుడు డాక్టర్ రామచంద్ర చెప్పారు. శనివారం ఆశ్రమంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9 రాష్ట్రాల నుంచి దాదాపుగా 3వేల మంది ప్రతినిధులు సమ్మేళానికి హాజరవుతున్నారన్నారు. దీర్ఘకాలిక రుగ్మతలను నివారించటానికి ఎటువంటి చర్యలు చేపట్టాలనేదానిపై చర్చ జరుగుతుంది. సహజ వంటకాలు, మిల్లెట్స్ ఏర్పాటు చేయటం జరుగుతున్నది. జాతీయ ఆరోగ్య సమ్మేళనంలో 100 రకాల దేశవాళీ బియ్యం ప్రదర్శన, 100 రకాల దేశవాళీ కూరగాయల విత్తనాల ప్రదర్శన, మగ్గం నేత, మట్టి కుండల తయారీ ప్రదర్శన, భారత పురాతన మల్ల ఖంబ్ క్రీడా ప్రదర్శన, బాల,బాలికలచే కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మధిరటౌన్,జనవరి20: శ్రీరామ తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మధిర లోని రామాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శం అనే అంశంపై జరిగిన పోటీలో మధిర, ఎర్రుపాలెం మండలాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

తాలును వేరు చేస్తే పంటకు మంచి ధర: ఏవో

కొణిజర్ల, జనవరి20: రైతులు మిరప పంటను కోసిన తర్వాత బాగా ఎండపెట్టి తాలుకాయలను, మచ్చకాయలను వేరు చేసి మార్కెట్‌లోకి తీసుకెళ్లితే మంచి ధర వస్తుందని మండల వ్యవసాయాధికారి బాలాజీ తెలిపారు. శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చిన్నగోపతి, అమ్మపాలెం గ్రామాల్లో కూలీలు కోస్తున్న మిర్చి తోటలను, కల్లాలో ఆరబోసిన పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. రైతులు తాలు, మచ్చలు ఉన్న మిర్చీని కూడ కలిపి మార్కెట్‌లోకి తీసుకెళ్లితే ధర రాదని, ఆరబోసి తాలు, మచ్చలున్న కాయలను వేరు చేసి తీసుకెళ్లితె డిమాండ్ బాగా ఉంటుందని అన్నారు. క్వింటా కాయను ఎండబెట్టిన తర్వాత పది కేజీల ఎండు మిరపకాయలు అవుతాయని తెలిపారు. ఈ ఏడాది తుఫాన్ వలన మిరపలో కాయమచ్చ, తాలు బాగా పెరిగిందని, దాంతో దిగుబడులు తగ్గాయన్నారు. రైతులు ఇప్పటికైన తాలును వేరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బాలాజీ

ప్రభుత్వం హామీలపై దృష్టి సారించాలి

కొణిజర్ల, జనవరి20: ప్రభుత్వం ప్రజలకు చేసిన వాగ్దానాల ప్రకారం ఆరుగ్యారంటీలపై దృష్టి పెట్టి వంద రోజుల్లో అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వేములకొండ రమేష్ తెలిపారు. మండల పరిధిలోని గుబ్బగుర్తి గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు పాపగంటి సుదర్శన్, శేషయ్య, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీ మండల అధ్యక్షుడిగా రవికిరణ్



సత్తుపల్లిరూరల్, జనవరి20: నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ మండల అధ్యక్షుడిగా పిల్లి రవికిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని ఎన్టీఆర్ నగర్ క్రీస్తుసంఘం ప్రార్థనా మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆసంఘ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా వాళ్ల విజయకుమార్, ఉపాధ్యక్షుడిగా కే.సుందర్‌రావు, ఉపకార్యదర్శిగా ఈ.దానియేలు, కోశాధికారిగా బీ.చార్లెస్‌బెన్నీ, ప్రచార కార్యదర్శిగా హెచ్చు ఏసుపాదంతో కమిటీని ఎన్నుకున్నారు.

లింక్‌రోడ్డు సర్వే

వైరా, జనవరి20: మండలంలోని గండగలపాడు-ముసలిమడుగు లింక్ రోడ్డును శనివారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. స్నానాల లక్ష్మీపురం గ్రామానికి వెలుపల నుంచి పొలాల గుండా గండగలపాడు-ముసలిమడుగు లింక్ రోడ్డు ఉంది. వైరానదికి వరదలు వచ్చిన సమయంలో ముసలిమడుగు గ్రామస్థులు లక్ష్మీపురం మీదుగా తమ గ్రామానికి వెళ్లే అవకాశం లేదు. ఆసమయంలో ఈ లింక్ రోడ్డే కీలకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సర్వే చేశారు.

టీపీటీఎఫ్ ద్వితీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

నేలకొండపల్లి,జనవరి20: టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభ పోస్టర్‌ను ఎంపీడీఓ జములా రెడ్డి, ఎస్టీఓ నేతి వెంకట కృష్ణారావు ఆవిష్కరించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తేజావత్ గోవిందరావు, పెద్ది జగన్నాదం, తేజావత్ వెంకరావు, రవికిషోర్, హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తల్లాడ,జనవరి20: ఇండ్రస్టీయల్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఉండదని ఎన్‌పీడీసీఎల్ తల్లాడ ఏఈ రాజేష్ తెలిపారు. తల్లాడ, అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాల్లోని పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు.

కారుణ్య విద్యాభవన్ పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో

ఖమ్మంరూరల్, జనవరి20: మండల పరిధిలోని కరుణగిరిలోని కారుణ్యవిద్యాభవన్ పాఠశాలలో సైన్స్, సోషల్ ఇంగ్లీష్ ఎక్స్‌పోను శనివారం నిర్వహించారు. చంద్రయాన్ త్రీ, హిమాలయ పర్వతాల నుండి నదుల ప్రవాహం, పాత పార్లమెంట్ భవన నమూనా వంటి ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేశారు.

హోంగార్డుకు సన్మానం

ఖమ్మంక్రైం, జనవరి20: ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు బి.కృష్ణయ్యను పోలీసుకమిషనర్ సునిల్‌దత్ తన కార్యాలయంలో శనివారం శాలువా, పూల మాలలతో సన్మానించారు. సుదీర్ఘకాలంగా వివిద విభాగాలలో బాధ్యతయుతామైన విదులునిర్వహించి పోలీసుశాఖకు సేవలతో పోలీసు అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు.

కూసుమంచి మాజీ సర్పంచ్ మూన్య మృతి



కూసుమంచి: కూసుమంచి గ్రామపంచాయతీ మాజీ సర్పంచి జర్పుల మూన్యా నాయక్ (60) అనారోగ్యంతో మృతిచెందాడు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడైన మూన్య 2000 నుంచి 2005 వరకు సర్పంచిగా కొనసాగారు. మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్‌కు ముఖ్య అనుచరుడిగా పనిచేశారు. మూన్యాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు జర్పుల చిరంజీవి పంచాయతీ రాజ్ ఏఈగా పనిచేస్తుండగా, అల్లుడు రవి వీఆర్ఏగా పనిచేస్తున్నారు. మూన్యా మృతిపట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

మానవ హక్కులపై అవగాహన

పెనుబల్లి, జనవరి20:ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మానవహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బొడ్డుపాటి దాసు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అనిత, అధ్యాపకులు అరవింద్‌బాబు, సతీష్‌చంద్ర,లైబ్రేరియన్ కొమ్ము గురవయ్య పాల్గొన్నారు.

అథ్లెట్లను అభినందించిన కలెక్టర్

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 20: చెన్నైలో జరగనున్న 6వ జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ క్రీడాకారులు గౌతమ్, వివేక్‌చంద్రను శనివారం జిల్లా కలెక్టర్ గౌతమ్ అభినందించారు. జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ కోచ్ గౌస్ తదితరులు ఉన్నారు.

పశువైద్యశిబిరం విజయవంతం

నేలకొండపల్లి, జనవరి20: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, వైరా, పశు సంవర్థక శాఖలు శనివారం చెన్నారంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత గోపాలమిత్రుల పశువైద్య శిబిరం విజయవంతమైంది. నేలకొండపల్లి పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ బోడెపూడి శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 37 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 45 లేగ దూడలకు నట్టల నివారణా మందును తాగించారు. 25 పశువులకు సాధారణ జబ్బులకు చికిత్స చేశారు. రాజేశ్వరపురం పశు వైద్యుడు సంజయ్‌రెడ్డి పశువులకు చికిత్స చేశారు. ముదిగొండ పశువైద్యాధికారి అశోక్, గోపాల మిత్రులు తాజ్‌పాషా, నాగరాజు, పాండు, రంగయ్య, నరేష్ సహకరించారు. కోరుట్ల వెటర్నరీ యూనివర్సిటీ విద్యార్థులు శిబిరంలో పాల్గొని సహకరించారు. కార్యక్రమంలో చెన్నారం సొసైటీ అధ్యక్షుడు వందనపు నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు చింతనిప్పు సైదులుతో పాటుగా పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.


పశువుకు చికిత్స చేస్తున్న వైద్యుడు